

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం


05.07.2026

ఆదివారం |రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 05

పేజీలు : 08 | వెల: రూ.5


AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం


PUBLISHED BYANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


### సంక్షోభం నుంచి తక్కువ

## భారంతో బయటపడ్డాం

- ఇంధన సంక్షోభాన్ని భారత్
- విజయవంతంగా ఎదుర్కొందాం
- ప్రధాని నరేంద్ర మోదీ
- పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో
- ఇంధన దిగుమతుల్లో వైవిధ్యం

5లో..



జైపూర్, జులై 04, అనంతజనశక్తి న్యూస్

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా ఎదుర్కొందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.





కామన్వెల్త్, ఏషియన్ గేమ్స్‌కు ఎంపికైన రాష్ట్ర అత్యుత్తమ క్రీడాకారులతో ఉండవల్లి నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విందు సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి. ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై క్రీడాకారుల నుంచి ఆయన సూచనలు స్వీకరించారు. రాష్ట్రంలో వరల్డ్ క్లాస్ స్పోర్ట్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రముఖ జేఎస్‌డబ్ల్యూ సంస్థ ముందుకు వచ్చిందని, రాష్ట్రంలో క్రీడల పురోభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

### పరిపాలనకు పాలమూరు

# బిడ్డలు పనికిరారా

- కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్
- భూమికి, విత్తనానికి మధ్య బంధం ఎలా ఉంటుందో..
- పేదవాడికి, పాలన చేసేవాడికి మధ్య అదే బంధం
- దోచుకోవడమే పని
- మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే..
- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు
- పేదల మధ్య పెరిగిన తనకు సమస్యలు తెలియవా?
- దొరలకు సమస్యలపై అవగాహన ఉండకపోవచ్చు

2లో..

మహబూబ్‌నగర్, జులై 04,
అనంత జనశక్తి న్యూస్

దొరలకు సమస్యలపై అవగాహన ఉండకపోవచ్చని.. పేదల మధ్య పెరిగిన తనకు సమస్యలు తెలియవా? అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తట్ట పనికి, మట్టి పనికి మనమే కావాలి.. కానీ, పరిపాలనకు పాలమూరు బిడ్డలు పనికిరారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. భూమికి, విత్తనానికి మధ్య బంధం ఎలా ఉంటుందో.. పేదవాడికి, పాలన చేసేవాడికి మధ్య అదే బంధం ఉంటుందని పేర్కొన్నారు. అహంకారులకు బుద్ధి చెప్పాలా? వద్దా? అని ప్రశ్నించారు. గద్దర్ అన్నను గడీ ముందు నిలబెట్టినవారికి ఉరిశిక్ష వేసినా తక్కువే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధిగా 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని మిడ్జిల్‌లో శనివారం కృతజ్ఞత సభ జరిగింది. సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే.. అప్పుల రాష్ట్రంగా మార్చారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబంలో వారికే పదవులు వచ్చాయి. ప్రజాపాలన ఎందుకు పోవాలో ఎక్కడికక్కడ చర్చ పెట్టండి. రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? ఉచిత కరెంట్ ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? గంజాయి, డ్రగ్స్‌ను నియంత్రించినందుకు ప్రజాపాలన పోవాలా?.. మీ దోపిడీకి అడ్డుకట్ట పడినందునే.. ప్రజాపాలన పోవాలని కోరుకుంటున్నారు. ప్రతిదాంట్లో కమీషన్లు తిన్నారు. బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడ్డారు'..



'కేసీఆర్ కుటుంబానికి ఆస్తులు పెరిగితే.. తెలంగాణకు అప్పులు మాత్రమే మిగిలాయి. కేసీఆర్ కుటుంబంలో అందరికీ ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. సమస్యలపై ప్రతిపక్ష నేత మాట్లాడరంట. అధికారం ఇస్తే దోచుకోవడానికి మాత్రం వస్తారట. వాళ్లు దోచుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రజలు ఆలోచించాలి. అరుంధతి సినిమాలో పశుపతిలా.. కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌లో బంధించాం. ఫామ్‌హౌస్ నుంచి కేసీఆర్ బయటికొచ్చే పరిస్థితి లేదు. బీఆర్ఎస్‌కు అధికారం అన్నది కలే. బీఆర్ఎస్‌కు గతం తప్ప భవిష్యత్ లేదు. మళ్లీ కాంగ్రెస్ రావాలి. రాహుల్ ప్రధాని కావాలి. రాహుల్‌ను ప్రధానిగా చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది' అని అన్నారు.

మిడ్జిల్ గడ్డపై సీఎం రేవంత్ రెడ్డి భావోద్వేగం

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలానికి చేరుకున్న సీఎం ఏ. రేవంత్ రెడ్డి, అక్కడ ఏర్పాటు చేసిన "కృతజ్ఞత సభ"లో అత్యంత భావోద్వేగంగా మాట్లాడారు. సరిగ్గా 20 ఏళ్ల క్రితం, జూలై 2006లో మిడ్జిల్ మండల ప్రజలు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తనను ఆశీర్వదించి గెలిపించి సువర్ణాక్షరాలతో ఒక చరిత్రను లిఖించారని గుర్తుచేసుకున్నారు. ఆనాడు ఈ ప్రాంత ప్రజలు నాటిన మొక్కే, ఈనాడు మహా వృక్షమై ముఖ్యమంత్రిగా మీ ముందు నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ గెలుపు తనది కాదని, తనను ఆదరించిన మిడ్జిల్ ప్రజలదని, ఈ గడ్డ రుణం తీర్చుకోవడానికి తన ప్రాణమిచ్చినా తక్కువేనని సీఎం వ్యాఖ్యానించారు.

### టెలిగ్రామ్‌కు కేంద్రం నోటీసు

- పైరసీ సినిమాలు, ఓటీటీ కంటెంట్‌పై
- 3,142 పైరసీ ఛానళ్ల గుర్తింపు.!

5లో..




## పాలమూరు అంటే సీఎంకు ఇష్టం

- డిప్యూటీ సీఎం భట్టి ప్రశంసలు
- జడ్పీటీసీగా దీవించిన ఈ ప్రాంత ప్రజలు
- సీఎం అయ్యేందుకు సహకరించారు
- పేదోడి కష్టాలు స్వయంగా తెలిసిన నాయకుడు

2లో..



హైదరాబాద్, జులై 04, అనంత జనశక్తి న్యూస్

ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. రెండు దశాబ్దాల క్రితం తనను జడ్పీటీసీగా దీవించిన ఈ ప్రాంత ప్రజల చెంతకు, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా మారి కృతజ్ఞతలు చెప్పుకోవడానికి రావడం రేవంత్ రెడ్డి గారి ఉన్నతమైన సంస్కారానికి నిదర్శనమని కొనియాడారు. కేవలం అధికారుల సలహాలకే పరిమితం కాకుండా, పేదోడి కష్టాలు స్వయంగా తెలిసిన నాయకుడిగా రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో అద్భుతమైన ప్రజాపాలన అందిస్తున్నారని, ప్రకృతి కూడా ఆశీర్వదించేంత మంచి సంకల్పంతో ఆయన నిరంతరం ప్రజల కోసమే పరితపిస్తున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## షెడ్యూల్ వచ్చేసింది

- పార్లమెంట్ వర్షా కాల సమావేశాల
- కిరణ్ రిజిజు ప్రకటన
- ఈనెల 20 నుంచి వచ్చే నెల 13 వరకు సమావేశాలు

2లో..

న్యూఢిల్లీ, జులై 04, అనంత జనశక్తి న్యూస్

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు షెడ్యూల్ వచ్చేసింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు పార్లమెంట్ 2026 వర్షాకాల సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు.

## హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే

- అప్పులపై భట్టి అసత్యాలు చెబుతున్నారు
- డిప్యూటీ సీఎం చెప్పేవన్నీ అబద్ధాలే
- మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్
- గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఫైర్

2లో..



హైదరాబాద్, జులై 04, అనంత జనశక్తి న్యూస్

తెలంగాణ రాష్ట్ర అప్పులపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసత్యాలు చెబుతున్నారని, హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో లేని అప్పులను ఉన్నట్టుగా చూపిస్తూ కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## తాడేపల్లి ప్యాలెస్ నుంచి నెల నెలా ఎంత ముడుతోంది?

- మంత్రి దుర్గేశ్ ఆగ్రహం
- నటుడు ప్రకాశ్ రాజ్‌పై సంచలన కామెంట్లు
- రాష్ట్రంలో ఘర్షణ వాతావరణం సృష్టించొద్దు
- జోసెఫ్ రావణ్‌పైనా విమర్శలు
- ప్రకాశ్ రాజ్, రావణ్ సంఘ విద్రోహక శక్తులు



అమరావతి, జులై 04,
అనంతజనశక్తి న్యూస్

నటుడు ప్రకాష్‌రాజ్ చేసిన ట్వీట్‌పై మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఘర్షణ వాతావరణాన్ని సృష్టించేలా కొందరు వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రకాష్‌రాజ్‌తో పాటు జోసెఫ్ రావణ్‌పై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీడియాతో మాట్లాడిన మంత్రి దుర్గేష్.. ప్రకాష్‌రాజ్, జోసెఫ్ రావణ్ సంఘవిద్రోహ శక్తులుగా మారారని విమర్శించారు. ప్రకాష్‌రాజ్‌కు జోసెఫ్ రావణ్‌తో ఏమైనా సంబంధం ఉందా? అనే అనుమానాలు వ్యక్తం చేశారు.

2లో..

## మమతా బెనర్జీకి భారీ షాక్

- టీఎంసీ ప్రధాన కార్యాలయం స్వాధీనం
- రెబల్స్ ప్రజా ప్రతినిధుల సంచలన అడుగు

2లో..

కోల్‌కతా, జులై 04, అనంత జనశక్తి న్యూస్

రీతబ్రత బెనర్జీ నేతృత్వంలోని ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ ( టీఎంసీ )లోని తిరుగుబాటు వర్గం.. కోల్‌కతా మెట్రోపాలిటన్ ప్రాంతంలోని పార్టీ ప్రధాన కార్యాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంది. ఫిర్హాద్ హకీం, సందీపన్ సాహా, జావేద్ ఖాన్, పార్టీ కోశాధికారి అక్రుజ్జమాన్‌తో సహా పలువురు ఎమ్మెల్యేలు వెంటరాగా.. ఈ బృందం ఆ ప్రాంగణంలోకి ప్రవేశించి, గేట్ల తాళాలను మార్చి, కొత్త పోస్టర్లను అంటించారు.

## యూట్యూబర్ ప్రశ్న రావణ్‌కు బెయిల్

- అంతలోనే షాక్.. మళ్లీ అరెస్ట్!
- పవన్ కళ్యాణ్ మీద అనుచిత వ్యాఖ్యల కేసు

2లో..





# పాలమూరు అంటే సీఎంకు ఇష్టం

**హైదరాబాద్, జులై 04, అనంత జనశక్తి న్యూస్**

ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. రెండు దశాబ్దాల క్రితం తనను జడ్పీటీసీగా దీవించిన ఈ ప్రాంత ప్రజల చెంతకు, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా మారి కృతజ్ఞతలు చెప్పుకోవడానికి రావడం రేవంత్ రెడ్డి గారి ఉన్నతమైన సంస్కారానికి నిదర్శనమని కొనియాడారు. కేవలం అధికారుల సలహాలకే పరిమితం కాకుండా, పేదోడి కష్టాలు స్వయంగా తెలిసిన నాయకుడిగా రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో అద్భుతమైన ప్రజాపాలన అందిస్తున్నారని, ప్రకృతి కూడా ఆశీర్వదించేంత మంచి సంకల్పంతో ఆయన నిరంతరం ప్రజల కోసమే పరితపిస్తున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే అజెండాగా చారిత్రాత్మక నిర్ణయాలు

రాష్ట్రంలో ఆకలి లేని సమాజమే లక్ష్యంగా కోటి పదిహేను లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, అలాగే 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లో పౌష్టికాహారం అందించడం ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధతను చాటుతోందని భట్టి విక్రమార్క వివరించారు. నిరుపేదలకు అండగా ఇందిరమ్మ ఇళ్లు, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అక్కాచెల్లెమ్మలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ ప్రజా సంక్షేమమే అజెండాగా ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత పాలకుల హయాంలో నిరంతరం భయంతో బతికిన తెలంగాణ ప్రజలకు, నేడు నిజమైన స్వేచ్ఛా స్వతంత్ర జీవనాన్ని ప్రసాదించిన ధీశాలి రేవంత్ రెడ్డి అని డిప్యూటీ సీఎం కొనియాడారు.

### యూట్యూబర్ ప్రశ్న

# రావణ్‌కు బెయిల్



**- ఎలమంచిలి కోర్టు బెయిల్ మంజూరు**
**- వేంపాడు టోల్ ప్లాజా వద్ద అదుపులోకి**

**అమరావతి, జులై 04, అనంతజనశక్తి న్యూస్**

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మీద అనుచిత వ్యాఖ్యల కేసులో అరెస్ట్ అయిన యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌కు మరో షాక్ తగిలింది. ఈ కేసులో ప్రశ్న రావణ్ కు ఎలమంచిలి కోర్టు బెయిల్ మంజూరు చేయగా.. కాసేపటికే ఏలూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అంతకుముందు జైభీమ్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రవణ్ కుమార్ ప్రశ్న రావణ్ తరుపున ఎలమంచిలి కోర్టులో వాదనలు వినిపించారు. అనంతరం కోర్టు బెయిల్ మంజూరు చేయటంతో జడ శ్రవణ్ కుమార్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు ప్రశ్న రావణ్. తనకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలియజేసిన ప్రశ్న రావణ్.. మిగతా విషయాలు ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడుతానని అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే వేంపాడు టోల్ ప్లాజా వద్ద ఏలూరు పోలీసులు రావణ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

కొనసాగుతున్న ఫిర్యాదులు..

మరోవైపు పవన్ కల్యాణ్ గురించి, సనాతన ధర్మంపైనా ప్రశ్న రావణ్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మరోచోట పోలీసులకు ఫిర్యాదు అందింది. విజయనగరంలో జనసేన నేతలు.. ప్రశ్న రావణ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనసేన నేత రాధిక నేతృత్వంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదును అందజేశారు. భావప్రకటన స్వేచ్ఛ పేరుతో కొంతమంది యూట్యూబర్లు సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తున్నారని జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని ప్రశ్న రావణ్ చేసిన వ్యాఖ్యలు చెడు సంకేతాలు పంపుతాయని.. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో ప్రశ్న రావణ్‌ను తొలుత హైదరాబాద్‌లో ఏపీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి కాకినాడ జిల్లా పిఠాపురం తరలించారు. పిఠాపురంలో స్థానిక మెజిస్ట్రేట్ కోర్టు ప్రశ్న రావణ్ బెయిల్ మంజూరు చేయగా.. ఆ వెంటనే సర్పవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేశారనే కేసుపై మళ్లీ అరెస్ట్ చేశారు. ఆ కేసులోనూ కాకినాడ మొబైల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అనంతరం కృష్ణా జిల్లా మచిలీపట్నం పోలీసులు మరో కేసులో అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులోనూ ప్రశ్న రావణ్‌కు బెయిల్ రాగా.. ఇంకో కేసులో ఎలమంచిలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఎలమంచిలి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈలోపే మరో కేసులో ఏలూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

### తాడేపల్లి ప్యాలెస్ నుంచి

# నెల నెలా ఎంత ముడుతోంది?

**అమరావతి, జులై 04, అనంతజనశక్తి న్యూస్**

నటుడు ప్రకాష్‌రాజ్ చేసిన ట్వీట్‌పై మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఘర్షణ వాతావరణాన్ని సృష్టించేలా కొందరు వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రకాష్‌రాజ్‌తో పాటు జోసెఫ్ రావణ్‌పై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీడియాతో మాట్లాడిన మంత్రి దుర్గేష్.. ప్రకాష్‌రాజ్, జోసెఫ్ రావణ్ సంఘవిద్రోహ శక్తులుగా మారారని విమర్శించారు. ప్రకాష్‌రాజ్‌కు జోసెఫ్ రావణ్‌తో ఏమైనా సంబంధం ఉందా? అనే అనుమానాలు వ్యక్తం చేశారు.

**గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనలపై ప్రకాష్‌రాజ్ ఎందుకు స్పందించలేదని మంత్రి ప్రశ్నించారు. వైసీపీ పాలనలో జరిగిన అకృత్యాలు, హిందూ ఆలయాలపై దాడుల సమయంలో ఆయన ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. అంతేకాకుండా, తాడేపల్లి ప్యాలెస్ నుంచి మీకు ప్రతి నెలా ఎంత డబ్బు అందుతోందని ప్రకాష్‌రాజ్‌ను ఉద్దేశించి మంత్రి దుర్గేష్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించి విధ్వంసకర వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి దుర్గేష్ వ్యాఖ్యానించారు.**

**పవన్ కల్యాణ్‌ను కుల చట్రంలో బంధించేందుకు కుట్రలు**

**సినీనటుడు ప్రకాశ్‌రాజ్, కాకినాడకు చెందిన యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ (రావణ్) వ్యాఖ్యలపై మంత్రి కందుల దుర్గేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జస్ట్ ఆస్కింగ్ అంటున్న ప్రకాశ్ రాజ్, జోసెఫ్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జోసెఫ్ సూచనలతో ప్రకాశ్‌రాజ్ స్పందిస్తారని విమర్శించారు. " ఇద్దరి మధ్య అనుబంధం ఉందనేందుకు మా దగ్గర ఆధారాలున్నాయి. జోసెఫ్ ప్రశ్నించగానే.. జస్ట్ ఆస్కింగ్ అంటూ ప్రకాశ్‌రాజ్ వస్తారు. పవన్ కల్యాణ్ లక్ష్యంగా ఇద్దరూ కలిసి కుట్రలు చేస్తున్నారు. తెరముందు వీళ్లుంటే.. తెర వెనుక ఎవరున్నారో తేలాలి. తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే ఈ కుట్ర సాగుతోంది.**

**కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కుట్రలు చేస్తున్నారు. ఇలాంటి సంఘవిద్రోహ శక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. వైకాపా పాలనలో జస్ట్ ఆస్కింగ్ అని ఎందుకు అడగలేకపోయారు? పవన్ కల్యాణ్‌ను ఒక కుల చట్రంలో బంధించేందుకు కుట్రలు చేస్తున్నారు. ప్రశ్నించడం అంటే.. బూతులు తిట్టడం.. వ్యక్తిగత విమర్శలు చేయడమా? ప్యాలెస్ నుంచి వచ్చే డబ్బు కోసమే ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతున్నారు.**

# పరిపాలనకు పాలమూరు బిడ్డలు పనికిరారా

**మహబూబ్‌నగర్, జులై 04, :అనంత జనశక్తి న్యూస్**



దొరలకు సమస్యలపై అవగాహన ఉండకపోవచ్చని.. పేదల మధ్య పెరిగిన తనకు సమస్యలు తెలియవా? అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తట్ట పనికి, మట్టి పనికి మనమే కావాలి.. కానీ, పరిపాలనకు పాలమూరు బిడ్డలు పనికిరారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. భూమికి, విత్తనానికి మధ్య బంధం ఎలా ఉంటుందో.. పేదవాడికి, పాలన చేసేవాడికి మధ్య అదే బంధం ఉంటుందని పేర్కొన్నారు. అహంకారులకు బుద్ధి చెప్పాలా? వద్దా? అని ప్రశ్నించారు. గద్దర్ అన్నను గడీ ముందు నిలబెట్టినవారికి ఉరిశిక్ష వేసినా తక్కువే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధిగా 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని మిడ్జిల్‌లో శనివారం కృతజ్ఞత సభ జరిగింది. సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే.. అప్పుల రాష్ట్రంగా మార్చారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబంలో వారికే పదవులు వచ్చాయి. ప్రజాపాలన ఎందుకు పోవాలో ఎక్కడికక్కడ చర్చ పెట్టండి. రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? ఉచిత కరెంట్ ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? గంజాయి, డ్రగ్స్‌ను నియంత్రించినందుకు ప్రజాపాలన పోవాలా?.. మీ దోపిడీకి అడ్డుకట్ట పడినందునే.. ప్రజాపాలన పోవాలని కోరుకుంటున్నారు. ప్రతిదాంట్లో కమీషన్లు తిన్నారు. బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడ్డారు'..

'కేసీఆర్ కుటుంబానికి ఆస్తులు పెరిగితే.. తెలంగాణకు అప్పులు మాత్రమే మిగిలాయి. కేసీఆర్ కుటుంబంలో అందరికీ ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. సమస్యలపై ప్రతిపక్ష నేత మాట్లాడరంట. అధికారం ఇస్తే దోచుకోవడానికి మాత్రం వస్తారట. వాళ్లు దోచుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రజలు ఆలోచించాలి. అరుంధతి సినిమాలో పశుపతిలా.. కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌లో బంధించాం. ఫామ్‌హౌస్ నుంచి కేసీఆర్ బయటికొచ్చే పరిస్థితి లేదు. బీఆర్ఎస్‌కు అధికారం అన్నది కలే. బీఆర్ఎస్‌కు గతం తప్ప భవిష్యత్ లేదు. మళ్లీ కాంగ్రెస్ రావాలి. రాహుల్ ప్రధాని కావాలి. రాహుల్‌ను ప్రధానిగా చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది' అని అన్నారు.

మిడ్జిల్ గడ్డపై సీఎం రేవంత్ రెడ్డి భావోద్వేగం

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలానికి చేరుకున్న సీఎం ఏ. రేవంత్ రెడ్డి, అక్కడ ఏర్పాటు చేసిన "కృతజ్ఞత సభ"లో అత్యంత భావోద్వేగంగా మాట్లాడారు. సరిగ్గా 20 ఏళ్ల క్రితం, జూలై 2006లో మిడ్జిల్ మండల ప్రజలు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తనను ఆశీర్వదించి గెలిపించి సువర్ణాక్షరాలతో ఒక చరిత్రను లిఖించారని గుర్తుచేసుకున్నారు. ఆనాడు ఈ ప్రాంత ప్రజలు నాటిన మొక్కే, ఈనాడు మహా వృక్షమై ముఖ్యమంత్రిగా మీ ముందు నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ గెలుపు తనది కాదని, తనను ఆదరించిన మిడ్జిల్ ప్రజలదని, ఈ గడ్డ రుణం తీర్చుకోవడానికి తన ప్రాణమిచ్చినా తక్కువేనని సీఎం వ్యాఖ్యానించారు.

మిడ్జిల్ దత్తత.. పెద్ద మనసు చాటుకున్న సీఎం

ఒకప్పుడు డార్క్ మండలాలుగా (చీకటి ప్రాంతాలుగా) ఉన్న మిడ్జిల్, గట్టు ప్రాంతాల ప్రజలు 2006 లో మార్పు కోసం తీసుకున్న నిర్ణయమే తనను ఈ స్థాయికి చేర్చిందన్నారు. ఈ మండలాన్ని జిల్లాకే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు గాను, దీనిని దత్తత తీసుకోవాలని సభలోనే ఉన్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఇదే సభలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహంతో పాటు, మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి ఎదుగుదలకు తోడ్పడిన మిడ్జిల్ బిడ్డ ద్యాప గోపాల్ రెడ్డి విగ్రహాన్ని కూడా సీఎం ఆవిష్కరించారు. అలాగే, ఆనాడు జడ్పీటీసీ ఎన్నికల్లో తనపై ఓడిపోయిన రబ్బానీకి ఒక మంచి పదవి ఇచ్చి గౌరవించాలని డిప్యూటీ సీఎంకు సూచించి రేవంత్ రెడ్డి తన రాజకీయ సంస్కారాన్ని చాటుకున్నారు.

పరిపాలనకు పాలమూరు బిడ్డ పనికిరాడా?

నల్లమల అడవుల నుంచి వచ్చిన తనకు పరిపాలన గురించి ఏమీ తెలియదని కొందరు అహంకారంతో అవహేళన చేశారని సీఎం మండిపడ్డారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కారమైతే రాష్ట్రంలో సమస్యలు ముగిసినట్లేనని, క్షేత్రస్థాయి ఇబ్బందులు తెలిసిన గ్రామీణ ప్రాంత వ్యక్తిగా తనకు పాలనపై పూర్తి అవగాహన ఉందన్నారు. "పరిపాలన చేయడానికి పాలమూరు బిడ్డ పనికిరాడా?" అని ప్రశ్నించిన ఆయన.. పేదల గళం గద్దర్ అన్నను గడీల ముందు నిలబెట్టిన వారికి ప్రజలు బుద్ధి చెప్పినా అహంకారం తగ్గలేదని విమర్శించారు. కులగణన ద్వారా వందేళ్ల సమస్యకు తమ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని, పేదల పక్షాన నిలబడి సన్నబియ్యం, రైతు రుణమాఫీ, ఉచిత బస్సు, సన్న వడ్లకు బోనస్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.

కేసీఆర్ పాలనపై నిప్పులు.. 2034 వరకు కాంగ్రెస్‌దే అధికారం

పదేళ్ల పాలనలో 8 లక్షల 21 వేల కోట్ల అప్పులు మిగిల్చిన కేసీఆర్, ప్రజలకు చేసిందేమీ లేదని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. "ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? దళితులకు మూడెకరాలు ఇచ్చారా? డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించారా?" అని ప్రశ్నించారు. కేవలం తమ దోపిడీ, దొంగతనాలు ఆగిపోయాయనే బాధతోనే కేసీఆర్ కొడుకు, అల్లుడు మళ్లీ అధికారంలోకి రావాలని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు దండుకున్న చరిత్ర వారిదని, అధికారంలో ఉన్నప్పుడు ఆడబిడ్డల ఫోన్ మాటలను దొంగతనంగా విన్నవాడు అసలు మనిషేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ ఇక అధికారాన్ని మర్చిపోవాల్సిందేనని, తెలంగాణలో 2034 వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి కృతజ్ఞతగా, దేశంలో రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు తెలంగాణ ప్రజలంతా అండగా నిలవాలని, ఆ చారిత్రక అడుగు మిడ్జిల్ నుంచే పడాలని పిలుపునిచ్చారు.

# హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే

**హైదరాబాద్, జులై 04, అనంత జనశక్తి న్యూస్**



తెలంగాణ రాష్ట్ర అప్పులపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసత్యాలు చెబుతున్నారని, హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో లేని అప్పులను ఉన్నట్టుగా చూపిస్తూ కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఎదుర్కొంటున్న వైఫల్యాల నుంచి, తమపై జరుగుతున్న డ్యామేజ్ నుంచి తప్పించుకునేందుకే భట్టి విక్రమార్క ఇప్పుడు కొత్త డ్రామాలకు తెరలేపారని, అందులో భాగమే ఇలా మాట్లాడుతున్నారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు.


హరీశ్ రావు మాట్లాడుతూ.. 'ఎన్నికల ముందు ప్రజలను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేక చేతులెత్తేస్తూ ఇలాంటి కుంటిసాకులను చెబుతున్నారు. ప్రజలను నమ్మించి ఓట్లు రాబట్టుకునేందుకే ఆనాడు గ్యారంటీ కార్డులు పంచారు. తీరా ఇప్పుడు వాటిని అమలు చేయాల్సి వచ్చేసరికి రోజుకో మాట, పూటకో సాకు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు కోపంతో ఊగిపోయినంత మాత్రాన వాస్తవాలు మారిపోవు. ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ఈ విధమైన రాజకీయ ఎత్తుగడలు వేస్తోంది.' అని అన్నారు.

రంకెలు వేసినంత మాత్రాన.. అంకెలు మారవు

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు రూ.5.16 లక్షల కోట్లు అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు అవాస్తవమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ చేసిన రూ.15 వేల కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ఖాతాలో చూపారని విమర్శించారు. రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారిపోవంటూ ఘాటుగా స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. '' బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి చెల్లించాల్సిన మొత్తం అప్పు రూ.4.14 లక్షల కోట్లు మాత్రమే. కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలను కేసీఆర్ అమలు చేశారు. నిధులు లేవని కేసీఆర్ ఏనాడూ సంక్షేమ పథకాలను ఆపలేదు. ఎన్నో చేస్తామని ఆనాడు కాంగ్రెస్ నేతలు బాండ్లు రాసిచ్చారు. కాంగ్రెస్ నేతల అనుభవం స్కామ్‌లు చేసేందుకే ఉపయోగపడుతోంది'' అని విమర్శించారు.

# షెడ్యూల్ వచ్చేసింది

**న్యూఢిల్లీ, జులై 04, అనంత జనశక్తి న్యూస్**



పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు షెడ్యూల్ వచ్చేసింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు పార్లమెంట్ 2026 వర్షాకాల సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దేశ ప్రాధాన్యత కలిగిన కీలక అంశాలపై అర్థవంతమైన చర్చలు, సమగ్ర చర్చోపచర్చలు, నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సమావేశాలు వేదిక కానున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

ఇక ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశముండగా దేశ ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, ఇతర సమకాలీన అంశాలపై కూడా ఇరు సభల్లో విస్తృతంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. అలాగే ప్రతిపక్ష పార్టీలు కూడా వివిధ ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశముంది. ఇటీవలి పరిణామాలు, దేశీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు పలు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను కూడా ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశాల్లో ప్రస్తావించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం కూడా తన కీలక విధానాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను సభ ముందుకు తీసుకురానుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు ముగియనున్న ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు, చర్చలు జరిగే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కీలక బిల్లులు

వర్షాకాల సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు (మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన)ను సవరణలతో మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన కూడా ఉండొచ్చని సమాచారం.

ప్రతిపక్షం వ్యూహం

ఇక ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీయడానికి సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య వంటి అంశాలపై కేంద్రాన్ని ఇరుకున పెట్టేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# మమతా బెనర్జీకి భారీ షాక్

**కోల్‌కతా, జులై 04, అనంత జనశక్తి న్యూస్**



రీతబ్రత బెనర్జీ నేతృత్వంలోని ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ ( టీఎంసీ )లోని తిరుగుబాటు వర్గం.. కోల్‌కతా మెట్రోపాలిటన్ ప్రాంతంలోని పార్టీ ప్రధాన కార్యాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంది. ఫిర్హాద్ హకీం, సందీపన్ సాహా, జావేద్ ఖాన్, పార్టీ కోశాధికారి అక్రుజ్జమాన్‌తో సహా పలువురు ఎమ్మెల్యేలు వెంటరాగా.. ఈ బృందం ఆ ప్రాంగణంలోకి ప్రవేశించి, గేట్ల తాళాలను మార్చి, కొత్త పోస్టర్లను అంటించి, లోపల సమావేశం నిర్వహించింది. పార్టీ ప్రధాన కార్యాలయంగా ఆ భవనం నుంచే తాము కార్యకలాపాలు నిర్వహిస్తామని వారు ప్రకటించారు. ఆ కార్యాలయంతో తృణమూల్ కాంగ్రెస్‌కు భావోద్వేగ అనుబంధం ఉందని అక్రుజ్జమాన్ అన్నారు. యజమానులతో ఒప్పందం పూర్తయిందని, ఇకపై అన్ని సంస్థాగత పనులు అక్కడి నుంచే జరుగుతాయని ఆయన తెలిపారు.

సీనియర్ ఎమ్మెల్యే అరూప్ రాయ్‌ను టీఎంసీ ఛైర్మన్‌గా పేర్కొంటూ మెయిన్ గేట్ వద్ద రెబల్స్ ఒక పోస్టర్‌ను కూడా అంటించారు. భవనం లోపల ఉన్న మమతా బెనర్జీ ఫోటోలు, కటౌట్‌లను యథాతథంగా ఉంచారు. శనివారం నుంచి తమ వర్గం అధికారికంగా ఆ కార్యాలయం నుంచే కార్యకలాపాలు ప్రారంభిస్తుందని రీతబ్రత బెనర్జీ తెలిపారు. ''మేము తృణమూల్ కాంగ్రెస్. ఇదే మా ప్రధాన కార్యాలయం'' అని ఆయన పేర్కొన్నారు. టీఎంసీ అసలు ఆఫీసును పునర్నిర్మించే సమయంలో అక్కడికి మారిన తర్వాత, 2022 నుంచి ఈ కార్యాలయం తృణమూల్ కార్యకలాపాల ప్రధాన కార్యాలయంగా పనిచేస్తోంది. కేంద్ర ఎన్నికల కమిషన్ పూర్తిస్థాయి ధర్మాసనాన్ని కలిసేందుకు రీతబ్రత బెనర్జీ, ఆయన సహచరులు ఢిల్లీని సందర్శించిన మర్నాడు ఈ చర్య చోటుచేసుకుంది. పార్టీ పేరు, గుర్తు, సంస్థాగత నిర్మాణం, ఆస్తులపై తమ వాదనలను ఆ ప్రతినిధి బృందం గట్టిగా వినిపించింది. రెబల్స్ ప్రతినిధి బృందంతో గురువారం జరిగిన సమావేశం తర్వాత సంస్థాగత ఎన్నికలు, అధికారిక సంతకాలు చేసేవారు, పార్టీ నియంత్రణపై పత్రాలు, ప్రతివాదనలను జులై 6వ తేదీ సాయంత్రం 5.30 గంటలలోపు సమర్పించాలని కోరుతూ ఎన్నికల సంఘం రెండు వర్గాలకూ లేఖ రాసింది. కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్న వార్త వ్యాపించడంతో మమతా బెనర్జీ విధేయులైన ఎమ్మెల్యేలు కార్యాలయానికి చేరుకున్నారు. గేట్లు తాళం వేసి ఉండటంతో వారు లోపలికి ప్రవేశించలేకపోయారు. ఈ సంఘటన దురదృష్టకరమని సీనియర్ తృణమూల్ నాయకుడు కునాల్ ఘోష్ అభివర్ణించారు. పార్టీకి చెందిన ఏ ఎమ్మెల్యేకైనా పార్టీ కార్యాలయానికి వచ్చే హక్కు ఉందని, మరి తాళాలు ఎందుకు వేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

''తృణమూల్ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నా.. వారి అవసరాలను పట్టించుకోని ఈ వ్యక్తులు తమ నియోజకవర్గాలకు వెళ్లరు. దానికి బదులుగా వేరొకరి చేతిలో కీలుబొమ్మలుగా మారి ఇదంతా చేస్తున్నారు'' అని ఘోష్ అన్నారు. అయితే, ఆఫీసును స్వాధీనం చేసుకోవడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల పరోక్ష మద్దతు ఉందని మమతా బెనర్జీ వర్గం ఆరోపించింది. ఈ ఆరోపణను రెబల్స్ ఖండించారు. గత నెలలో సమావేశమైన రెబల్స్.. సమాంతర జాతీయ నాయకత్వ నిర్మాణాన్ని ప్రకటిస్తూ అరూప్ రాయ్‌ను ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పదవికి మమతా బెనర్జీ ప్రతిపాదించిన అభ్యర్థిని తిరస్కరించి, రీతబ్రత బెనర్జీకి 58 మంది ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారు. ఇప్పుడు తమకు సుమారు 65 మంది ఎమ్మెల్యేలు మద్దతు ఉందని తిరుగుబాటు వర్గం చెబుతోంది.

# అయోధ్య విరాళాల లెక్కింపు.. జేబులు ఉన్న దుస్తులు, ఫోన్లపై నిషేధం



అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాల లెక్కింపు వ్యవస్థలో కఠిన నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించింది. విరాళాలు లెక్కించే సమయంలో సిబ్బంది మొబైల్ ఫోన్లు, కెమెరాలు ఉపయోగించడాన్ని నిషేధించింది. అదే విధంగా సదరు సిబ్బంది ఎలాంటి జేబులు లేని (పాకెట్‌లెస్ డ్రెస్) ప్రత్యేకమైన దుస్తులను ధరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇకపై, హుండీ లెక్కింపు హాలులోకి సిబ్బంది ప్రవేశించడానికి ముందు వారికి రెండంచెల భద్రతా తనిఖీలు నిర్వహించనున్నారు. విరాళాల లెక్కింపు విధానం లో కూడా సమూల మార్పులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇకనుంచి సిబ్బంది బల్లలు, కుర్చీల వద్ద కాకుండా, నేలపై కూర్చొనే విరాళాలను లెక్కిస్తారని తెలిపారు. నగదు, ఇతర విలువైన వస్తువులు దాచుకొనేందుకు అవకాశం లేకుండా ఉండేలా సిబ్బందికి జేబులు లేని ముదురు నీలం రంగు యూనిఫాం ఇవ్వనున్నారు.

ఈ కేసు దర్యాప్తులో భాగంగా 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' ఖాతాలపై ఆడిట్ నిర్వహించడానికి సిట్ సిద్ధమవుతున్నట్లు అధికారులు వెల్లడించారు. గత ఐదేళ్లలో ఆలయ నిర్మాణానికి అయిన ఖర్చులు, ఆలయానికి వచ్చిన విరాళాలు, నిధులను వారు సమీక్షించనున్నారు. దొంగలించిన నగలను ఎవరూ గుర్తు పట్టకుండా ఉండడానికి నిందితులు వాటిని కరిగించి.. బంగారు బిస్కెట్లుగా మార్చుకొని ఉంటారని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## ధైర్యముంటే భాజపాలో చేరి మాట్లాడండి – రెబల్స్‌కు దీదీ సవాల్

తృణమూల్ కాంగ్రెస్‌లో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. భాజపా తమ పార్టీలో చీలికలపై దృష్టి పెట్టిందన్నారు. టీఎంసీలో చోటుచేసుకుంటున్న మార్పులకు కాషాయ పార్టీనే కారణమని, అసమ్మతి నేతలను రెచ్చగొడుతోందన్నారు. తమ పార్టీలో నిజాయతీ లేని కొందరు నేతలు భాజపాకు అమ్ముడుపోయారని ఆరోపించారు. ధైర్యముంటే నేరుగా భాజపాలో చేరి తనను ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. తృణమూల్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రిమా భట్టాచార్య రాజీనామా.. తదనంతర పరిణామాల నేపథ్యంలో మమతా బెనర్జీ సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు.

అంతకుముందు.. మమతా బెనర్జీకి సన్నిహితురాలిగా పేరున్న చంద్రిమా బెంగాల్ తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. పార్టీలో అన్ని బాధ్యతల నుంచి వైదొలుతున్నట్లు ప్రకటించారు. విశ్వాసం లేనిచోట పనిచేయడం సాధ్యంకాదని.. అందుకే పార్టీని వీడుతున్నట్లు చెప్పారు. అయితే, రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎన్నికైన నెల రోజులకే ఆమె రాజీనామా చేయడం గమనార్హం. మరోవైపు, ఈ నిర్ణయం ప్రకటించిన కొన్ని నిమిషాల్లోనే రెబల్ నేతలతో కలిసి ఓ సమావేశంలో చంద్రిమా పాల్గొనడం గమనార్హం.

అందుకే దీదీని వీడుతున్నా చంద్రిమా భట్టాచార్య



"మమతా బెనర్జీకి నాపై విశ్వాసం సన్నగిల్లినట్లు కనిపించింది. తనపై నమ్మకం లేనప్పుడు పార్టీ కార్యకర్తగా కొనసాగడం కష్టం. కొందరు నేతలు నా నిజాయతీని ప్రశ్నిస్తున్నారు? నా గురించి మమతా బెనర్జీకి అన్నీ తెలుసు" అని చంద్రిమా పేర్కొన్నారు. గతంలో ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసిన ఆమెను జూన్ 3న పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా దీదీ నియమించిన విషయం తెలిసిందే.

## ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా ఎదుర్కొంది

**- ప్రధాని మోదీ**



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా ఎదుర్కొందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రభుత్వ విధానాలు, ఇంధన దిగుమతుల్లో వైవిధ్యం పాటించడం, బలమైన ద్వైపాక్షిక సంబంధాలతో సంక్షోభం నుంచి తక్కువ భారంతో బయటపడ్డామన్నారు. రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లా పచ్‌పద్రాలో.. దేశంలోనే తొలి గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీపెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించారు. దాంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ..''పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభానికి ముందు భారత్ 2526 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకుంది. సంక్షోభ సమయంలో ఆ సంఖ్యను 40కి పైగా దేశాలకు పెంచాం. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరగడంతో ఏప్రిల్ నుంచి జూన్ వరకు చమురు కంపెనీలకు రూ.75 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. ఆ భారాన్ని ప్రభుత్వమే భరించింది. ప్రజలపై భారం పడకుండా లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాం. ప్రస్తుతం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ సామర్థ్యం గల దేశంగా భారత్ ఎదిగింది. భారత్ విఫలమవుతుందని కొందరు విష ప్రచారం చేశారు. ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలూ జరిగాయి. కానీ అవేమి ఫలించలేదు. భారత్ విఫలమవుతుందని ఆశించిన వారు ఇప్పుడు తీవ్ర నిరాశలో ఉన్నారు. భాజపా ప్రభుత్వాలు కేవలం శంకుస్థాపనలు చేసి వదిలేయవు. పనులు పూర్తయ్యే వరకు నిరంతరం కృషి చేస్తాయి.'' అని పేర్కొన్నారు.

## భక్తుల విశ్వాసానికి విఘాతం

**- దోషులను నిర్ధారించి కఠినంగా శిక్షించాలి: హోసబలే**

**- అయోధ్య విరాళాల చోరీపై ఆరెస్సెస్ తొలి స్పందన**



దిల్లీ: అయోధ్యలోని రామ మందిరం విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) శుక్రవారం తొలిసారి స్పందించింది. దురదృష్టకరమైన విరాళాల చోరీని అసాధారణ ఘటనగా పరిగణించాలంది. దోషులుగా తేలినవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. "కోట్ల మంది భక్తుల త్యాగాలతో నిర్మితమైన అయోధ్య ఆలయంలో విరాళాల చోరీ ఉదంతం యావత్తు సమాజాన్ని, రామ భక్తుల్ని తీవ్రంగా కలచివేసింది. వారి విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. మాకు తీవ్ర ఆవేదనను, ఆగ్రహాన్ని కలిగించింది'' అని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే పేర్కొన్నారు. నిందితులను గుర్తించి వారికి కఠిన శిక్షలు పడేలా సిట్ దర్యాప్తు కొనసాగాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయాలని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు సూచించారు. దత్తాత్రేయ హోసబలే శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ' దర్యాప్తు కొనసాగుతున్న తరుణంలో హిందూ సమాజం సంయమనం పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనను ఆసరాగా చేసుకొని హిందూ ధర్మాన్ని, హిందూ సమాజాన్ని అపఖ్యాతిపాలు చేయాలని యత్నించే హిందూ వ్యతిరేక, దేశ వ్యతిరేక శక్తుల కుట్రల్ని తిప్పికొట్టాలని హోసబలే పిలుపునిచ్చారు.

రామాలయ బాధ్యతలను పర్యవేక్షిస్తోన్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు కీలక సమావేశం ఈ నెల 6న జరగనుంది. ఈ భేటీలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.విరాళాల చోరీపై దర్యాప్తు వేగవంతం చేసిన సిట్... గత ఐదేళ్ల కాలంలో ట్రస్ట్ నిర్వహించిన అన్ని ఆర్థిక లావాదేవీలను మరింత లోతుగా పరిశీలించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

## కేతన్ హత్య కేసు.. లై డిటెక్టర్‌కు అంగీకరించని సియా, చేతన్





పుణెలో యువ రియల్టర్ కేతన్ అగర్వాల్ (26) హత్య కేసు లో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో మరిన్ని విషయాలు రాబట్టడానికి నిందితులకు పాలీగ్రాఫ్ టెస్ట్ నిర్వహించేందుకు అనుమతినివ్వాలని పోలీసులు కోర్టును కోరారు. దీనిపై న్యాయస్థానం నిందితులకు నోటీసులు ఇచ్చింది. అయితే లై డిటెక్టర్ టెస్ట్‌కు సియా, చేతన్ అంగీకరించకపోవడంతో.. వారి సమ్మతి లేకుండా నిజ నిర్ధరణ పరీక్షను నిర్వహించవద్దని న్యాయస్థానం పోలీసులకు స్పష్టం చేసింది. నిందితులు స్వచ్ఛందంగా అంగీకరిస్తే తప్ప అటువంటి పరీక్షకు అనుమతినివ్వలేమని కోర్టు పేర్కొంది. ఈ కేసులో సియా, చేతన్‌కు 14 రోజుల పోలీసు కస్టడీ విధించడంతో.. వారిని యరవాడ సెంట్రల్ జైల్‌కు తరలించారు.

**జరగని పెళ్లికి టికెట్లు..**

సియా ఫోన్ చెక్ చేయగా ఆమె తన స్నేహితురాలికి పంపిన మెసేజ్‌లు ఈ కేసులో కీలకంగా మారాయి. అందులో సియా తన స్నేహితురాలిని పెళ్లికి ఆహ్వానిస్తూ.. అతిథులకు ఇచ్చే ఎంట్రీ టికెట్ బుక్ చేయడానికి ఆధార్ కార్డ్ పంపాలని కోరింది. అసలు జరగని పెళ్లి కోసం టికెట్లు బుక్ చేస్తున్నానంటూ అందులో నిందితురాలు పేర్కొన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో కేతన్‌ను ఎలాగైనా వదిలించుకోవాలని పెళ్లి కుదిరినప్పటి నుంచే.. సియా ప్రయత్నిస్తోందనడానికి ఆధారం దొరికిందని పోలీసులు భావిస్తున్నారు.

**మరిన్ని డిజిటల్ సాక్ష్యాలు..**

కేసు దర్యాప్తులో భాగంగా నిందితుల ఫోన్‌లలో తొలగించిన ఫోన్ కాల్స్, చాట్, ఇతర డేటాను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు లోనావాలా పోలీసులు కోర్టుకు వెల్లడించారు. ఆ డేటాలో వారు కోడ్ భాషలో మాట్లాడుకున్నట్లు ఉందన్నారు. వాటిని డీకోడ్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ హత్యతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న చేతన్ స్నేహితుడిని కూడా అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు. ఎవరికీ తెలియకుండా సియా దాచిపెట్టిన మరో ఫోన్‌ను కూడా తాము స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ పరికరాన్ని ఫోరెన్సిక్ పరీక్షకు పంపితే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## జులై 20నుంచి పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు



పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20నుంచి ప్రారంభం కానున్నాయని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఆగస్టు 13 వరకు ఈ సమావేశాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ సమావేశాల్లో జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసే ప్రసంగంతో పార్లమెంటు సమావేశాలు మొదలవుతాయి.

## ఉమర్ ఖాలిద్‌కు బెయిల్ నిరాకరణ



దిల్లీ అల్లర్ల కేసు లో అరెస్టయి జైలులో ఉన్న ఉమర్ ఖాలిద్ , షర్జీల్ ఇమామ్‌కు దిల్లీ కోర్టు బెయిల్ నిరాకరించింది. వారిద్దరికీ బెయిల్ నిరాకరిస్తూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కోర్టు గుర్తుచేసింది. అసలు వీరి బెయిల్ దరఖాస్తులు కూడా విచారణకు యోగ్యమైనవి కాదని.. అందువల్లే వాటిని కొట్టివేస్తున్నామని వెల్లడించింది.

**2020 దిల్లీ అల్లర్ల కేసు..**

పౌరసత్వ సవరణ చట్టానికి (CAA) వ్యతిరేకంగా 2020 ఫిబ్రవరిలో దిల్లీలో జరిగిన హింసాత్మక నిరసనలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే . ఆ అల్లర్లలో దాదాపు 53 మంది మృతి చెందగా.. 700 మందికి పైగా గాయపడ్డారు. ఈ అల్లర్లకు సంబంధించి 15 మందిని నిందితులుగా పేర్కొంటూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం (ఉపా) కింద ఛార్జిషీట్ నమోదు చేశారు. అనంతరం ఐదుగురు నిందితులకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఖాలిద్, ఇమామ్‌కు మాత్రం బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. ఈ కేసులో మిగతా నిందితులతో పోలిస్తే వీరిద్దరిపై అభియోగాలు బలంగా ఉన్నాయని పేర్కొంది.

## 9 ఏళ్లకే భాగవత ప్రవచనకర్తగా.. బాలిక సరికొత్త రికార్డ్



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంపాదించడం, అందులో ప్రావీణ్యం పొందడం అంత సులువు కాదు. అలాంటి అసాధారణ మార్గంలో పయనించి అద్భుత ప్రతిభతో 9 ఏళ్ల చిన్నారి శ్వేతిమ మాధవ్ ప్రియ ప్రపంచ రికార్డు సాధించింది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పుర్‌కు చెందిన శ్వేతిమ అంతర్జాతీయ భాగవత ప్రవచనకర్తగా ఆసియా బుక్ ఆఫ్ వరల్డ్‌లో చోటు సాధించింది. ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందింది.

2017 ఫిబ్రవరి 16న జన్మించిన శ్వేతిమ.. చిన్న వయసు నుంచే ఆధ్యాత్మిక అంశాలను ఆసక్తిగా తిలకించడం మొదలుపెట్టింది. ఆరేళ్ల వయసులోనే శ్రీమద్భాగవత కథ చెప్పడం ప్రారంభించింది. ఇప్పటి వరకు 36 వారాల పాటు భాగవత కథా ప్రవచనాలు చెప్పడంతో పాటు, 100కు పైగా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలు, నైతిక విలువల సందేశాన్ని ప్రజలకు చేరవేసింది. శ్వేతిమ చెప్పే భాగవత కథలు, ఆధ్యాత్మిక ప్రవచనాలకు పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారు.

## ఉగ్రవాదంపై ఉక్కుపాదం.. 23 మందిని టెర్రరిస్ట్‌లుగా ప్రకటించిన కేంద్రం




సీమాంతర ఉగ్రవాదంపై కేంద్రం ఉక్కుపాదం మోపుతోంది. దానిలో భాగంగా పాకిస్థాన్ కేంద్రంగా నడుస్తోన్న జైషే మహమ్మద్, లష్కరే తయ్యిబా, అనుబంధ ఉగ్రసంస్థలకు చెందిన 23 మంది ఆపరేటివ్‌స్‌ను ఉగ్రవాదులుగా ప్రకటించింది. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద వారిని ఉగ్రవాదులుగా పరిగణించినట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ శనివారం నోటిఫై చేసింది ). జమ్మూకశ్మీర్‌లో దాడులకు ప్రణాళికలు, డ్రోన్లతో ఆయుధాల సరఫరా, చొరబాట్లు, టెర్రర్ రిక్రూట్‌మెంట్ వంటి వాటిల్లో వారికి ప్రమేయం ఉందని పేర్కొంది. ఉపా చట్టం ప్రకారం.. ఒక వ్యక్తికి ఉగ్రవాద కార్యకలపాల్లో ప్రమేయం ఉందని భావిస్తే, వారిని ఉగ్రవాదిగా ప్రకటించే అధికారం కేంద్రానికి ఉంది. దాంతో వారి లావాదేవీలను నిలిపివేయడానికి, ఆస్తులను జప్తు చేయడానికి జాతీయ దర్యాప్తు సంస్థకు వీలు కలుగుతుంది. 2019లో చేసిన సవరణలతో వ్యక్తులను ఉగ్రవాదులుగా ప్రకటించడానికి అవకాశం ఏర్పడింది. అందుకు ముందు గ్రూప్‌లను మాత్రమే ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చేవారు. కాగా, ఈ 23 మందితో కలిపి ప్రకటిత ఉగ్రవాదుల సంఖ్య 80కి చేరింది.



# అనవసర యుద్ధం కొరగాని ఒప్పందం!

పాకిస్థాన్, ఖతార్‌ల మధ్యవర్తిత్వంతో అమెరికా-ఇరాన్ యుద్ధం ముగింపునకు అవగాహన ఒప్పందం కుదిరింది. అంతలోనే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో తొలిరౌండ్ చర్చలు వాయిదా పడ్డాయి. తరవాత స్విట్జర్లాండ్‌లో చర్చలు మళ్లీ పట్టాలకెక్కాయి. అరవై రోజుల్లో శాశ్వత శాంతి ఒప్పందాన్ని ఖరారు చేసుకోవాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. అమెరికా, ఇరాన్, వాటి మిత్రదేశాలు తక్షణం కాల్పులు నిలిపివేయాలని, లెబనాన్ సార్వభౌమత్వాన్ని గౌరవిస్తూ అక్కడ ఘర్షణలను అరికట్టడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. నిశితంగా గమనిస్తే, శాంతి ఒప్పందం ఎంత పేలుసైనదో అర్థమవుతుంది. ఇలాంటి ఒప్పందం ఒరగబెట్టిందేంటి? యుద్ధంతో సాధించిందేంటి? అనే ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి.

అమెరికా-ఇరాన్ యుద్ధంతో కలిగిన లాభనష్టాలను రిపబ్లికన్ పార్టీ సెనేటర్ బిల్ కాసిడీ స్పష్టంగా వివరించారు. యుద్ధానికి ముందు హర్మ్యూజ్ జలసంధి తెరిచే ఉంది. ఇరాన్‌పై తీవ్ర ఆంక్షలు అమలులో ఉన్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పేట్రేగిపోకుండా ఒక కట్టడి కూడా ఉండేది. యుద్ధం తర్వాత జరిగిందేంటని చూస్తే- హర్మ్యూజ్ జలసంధి మళ్లీ తెరుచుకుంది, ఆంక్షలు తొలగిపోతున్నాయి, ఉద్రిక్తతల నివారణ దెబ్బతింది. అగ్రరాజ్యం ఎన్ని బాంబులేసినా ఇరాన్ అణు కార్యక్రమాలను నిలువరించలేకపోయింది. ఇరాన్ తీరులోనూ మార్పు రాలేదు. ఇంకా 60 రోజులపాటు చర్చలు జరిపి ఏదో సాధిస్తామని చెబుతున్నారు. ఆ పని యుద్ధానికి ముందే చేయాల్సింది. ఒక్క క్షిపణిని వాడకుండానే చర్చలతో అనుకున్నది సాధించే అవకాశాన్ని విడిచిపెట్టి, అనవసర యుద్ధంతో అంతా అస్తవ్యస్తం చేశారనే విమర్శలు రేగుతున్నాయిప్పుడు.

**నిధులు ఇచ్చేదెవరు?**

యుద్ధంతో దెబ్బతిన్న ఇరాన్ పునర్నిర్మాణం, ఆర్థికాభివృద్ధికి 30వేల కోట్ల డాలర్ల కేటాయింపు ప్రస్తావన ఒప్పందంలో ఉంది. అయితే అది అమెరికా ఇవ్వబోయే డబ్బు కాదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పష్టం చేశారు. పొరుగు దేశాల నుంచి వచ్చే విదేశీ పెట్టుబడిగా చెబుతున్నారు. ఆ పొరుగు దేశాలు ఏవనేది కీలక ప్రశ్న. ఇరాన్ క్షిపణులు, డ్రోన్ దాడుల్లో కీలక గల్ఫ్ దేశాల్లో ఇంధన మౌలిక వసతులు దెబ్బతిన్నాయి. ఆర్థికంగా చితికిన ఈ దేశాలు ఇరాన్ పునర్నిర్మాణానికి నిధులిచ్చే పరిస్థితిలో లేవు. ఇరాన్‌లో ఆర్థికంగా, రాజకీయంగా పారదర్శకత కొరవడింది. అక్కడ ఎప్పుడేం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఇలాంటి అనిశ్చిత పరిస్థితులు ఉన్నచోటికి ప్రైవేట్ పెట్టుబడులు రావు. చైనా పెట్టుబడులకూ కొన్ని పరిమితులు అడ్డుపడుతున్నాయి. రష్యా స్వయంగా పెట్టుబడుల కొరతను... అమెరికా, ఐరోపాల నుంచి ఆర్థిక ఆంక్షలను ఎదుర్కొంటోంది. దీంతో ఇరాన్‌కు ఏ పక్షమూ నమ్మకంగా నిధులు సమకూర్చలేని పరిస్థితి ఉంది. అలాంటప్పుడు ఒప్పందం ప్రకారం ఇరాన్ పునర్నిర్మాణం ముందుకు సాగేదెలా? అంటే, ఇరాన్ ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించడానికి నిధులు ఇవ్వకుండా, శుష్క వాగ్దానాలతో యుద్ధాన్ని ముగించాలని చూస్తున్నట్లు అర్థమవుతోంది. ఒప్పందం ఒక రాజకీయ ముసుగు మాత్రమేనని తెలుస్తోంది.

ఇక ఇజ్రాయెల్ సంగతికొస్తే, తమ సైన్యం ఒప్పందానికి కట్టుబడదంటూ ఆ దేశ మంత్రులు కొంతమంది బహిరంగంగానే ప్రకటించారు. ఇరాన్‌పై తన వైఖరిలో మార్పేమీ లేదు. పైగా లెబనాన్‌పై దాడులకూ దిగింది. తృతీయ పక్షమైన ఇజ్రాయెల్ వైఖరిపైనే ఒప్పందం అమలు ఆధారపడి ఉంది. అయితే, ఒప్పందం తన ప్రయోజనాలకు విరుద్ధమంటూ, నిబంధనలను ససేమిరా అంగీకరించబోనంటోంది. ఇక అమెరికా-ఇరాన్ ఒప్పందం కుదరడంలో పాకిస్థాన్ పాత్రను భారతీయులు ప్రత్యేకంగా గమనిస్తున్నారు. మధ్యవర్తిగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఖతార్‌తో పాటు ట్రంప్ నమ్మకాన్ని చూరగొనడం దౌత్యపరమైన మార్పును సూచిస్తోంది. ఇది ఆ దేశం ఎప్పటి నుంచో కోరుకుంటున్న గుర్తింపును తెచ్చిపెట్టింది. చాబహార్ పోర్టు, ఇంధన సహకారం ద్వారా ఇరాన్‌తో తన సంబంధాలను జాగ్రత్తగా కాపాడుకుంటూనే- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకుంటున్న భారతదేశం దీన్ని నిశితంగా గమనిస్తోంది. ప్రాంతీయ మధ్యవర్తిగా గుర్తింపు పొందిన పాక్, ఇతర ప్రాంతీయ వివాదాలలో ఆ దౌత్య బలాన్ని ఉపయోగించుకునే అవకాశం ఉంది.

**ప్రజల కోసం కాదు!**

యుద్ధానంతర పరిణామాల నేపథ్యంలో ఇరాన్ పాలకుల మనుగడ ఏంటనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్ సైనిక సామర్థ్యం క్షీణించింది. పశ్చిమాసియాలో ఆ దేశ అనుచర శక్తులూ బలహీనపడ్డాయి. మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. అయితే టెహ్రాన్‌లోని ప్రస్తుత పాలకవర్గం రాజకీయంగా బలోపేతమైంది. ఇరాన్ భవిష్యత్తుపై చట్టబద్ధంగా చర్చలు జరపగల భాగస్వామిగా గుర్తింపును, ఆంక్షల ఉపశమనాన్ని బహుమతిగా పొందింది. యుద్ధంతో కష్టనష్టాల పాలై, ఇప్పటికీ మతరాజ్య పాలనతో ఇక్కట్లకు గురవుతున్న ఇరాన్ ప్రజలకు మాత్రం దక్కిందేమీలేదు. యుద్ధ సమయంలో అణచివేత మరింత తీవ్రమైంది. ఒప్పందం దరిమిలా ఆ దమననీతి ఇంకా పెరిగే అవకాశం ఉంది. 'ఇరాన్ ఎన్నడూ యుద్ధంలో గెలవలేదు, చర్చల్లో ఓడిపోలేదు' అని ట్రంప్ ఒకప్పుడు వ్యాఖ్యానించారు. తాజా ఒప్పందం దాన్ని నిజం చేస్తోంది. వ్యక్తిగత రాజకీయ లబ్ధి కోసం జరిగే యుద్ధాలు, కుదిరే ఒప్పందాలు నాయకుల సొంత ప్రచారానికి ఉపయోగపడతాయే తప్ప ప్రజలకు కాదు. ఒక చరిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకోవాలనీ, దాన్ని తన ఘన వారసత్వంగా చెప్పుకోవాలని ట్రంప్ ఆశించారు. ఆయన కోరుకున్నట్లే ఒప్పందం కుదుర్చుకున్నారు. మరోవైపు తన మనుగడను కాపాడుకోవాలని ఇరాన్ నాయకత్వం కోరుకుంది. ఆంక్షల సడలింపుతో వారనుకున్నదీ దక్కింది. లెబనాన్‌లో ఇష్టారాజ్యంగా వ్యవహరించాలనీ, అక్కడ హెజ్‌బొల్లా పనిపట్టాలని నెతన్యాహు కోరుకున్నారు. తాజా ఒప్పందం తనకేమీ పగ్గాలు వేయడం లేదు కాబట్టి, తాను అనుకున్నట్లు వ్యవహరించే స్వేచ్ఛ నెతన్యాహుకు ఉంది. చివరికి ఇరాన్, లెబనాన్, ఇజ్రాయెల్, గల్ఫ్, అమెరికా ప్రజలు మాత్రం ఖర్చులను భరించే బాధితులుగా మిగిలిపోయారు. నేటి కాలంలో యుద్ధం, శాంతి వ్యూహాత్మక ఫలితాలు నాయకుల వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మారుతున్నాయి. యుద్ధాలు, ఒప్పందాలు ప్రజల కోసమేనని చెబుతున్నా, వారిది ప్రేక్షక పాత్రే అవుతోంది.



# నడకదారి ఇక పౌరుల హక్కు

నగరాలు, పట్టణాలు, పల్లెటూళ్లన్న తేడా లేకుండా ఇకపై ప్రతి రహదారికీ పాదచారులు నడవటానికి వీలుగా ఫుట్‌పాత్‌లు ఉండి తీరాలనీ, ఇందుకు సంబంధించి ఒక చట్టం తీసుకురావాలనీ సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం ఇచ్చిన ఆదేశం పౌరులకు ఉపశమనం కలిగిస్తుంది. ఈ తీర్పు ప్రాముఖ్యతేమంటే... జీవించే హక్కుకు పూచీపడుతున్న రాజ్యాంగంలోని 21వ అధికరణాన్ని, దాంతోపాటు దేశంలో ఎక్కడికైనా వెళ్లే, స్థిరపడే, కలుసుకునే స్వేచ్ఛను వాగ్దానంచేసే అధికరణం 19(1) (ఎ), (బి), (సి), (డి)లను మరింత విస్తృతీకరించటం. దీని పర్యవసానంగా రోడ్లపక్కన ఫుట్‌పాత్‌లుండటం ఇకపై పౌరుల ప్రాథమిక హక్కుల్లో ఒకటవుతుంది. అయితే ఈ ఆదేశాలిచ్చే ముందు అసలు ఎన్ని నగరాల్లో, పట్టణాల్లో, గ్రామాల్లో ఫుట్‌పాత్‌లున్నాయో... వాటిల్లో ఎన్ని పనికొచ్చే విధంగా ఉన్నాయో గణాంకాలివ్వాలని ధర్మాసనం రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతా లను ఆదేశించాల్సింది. బహుశా అలాంటి ఆదేశం ఇస్తే దీర్ఘకాలం ఎదురుచూపులు చూడటం తప్ప ఫలితం ఉండబోదని న్యాయమూర్తులు భావించి ఉంటారు.



**న్యాయమూర్తులు భావించి ఉంటారు. న్యాయ స్థానాలు అడిగినప్పుడు ప్రభుత్వాలు తగిన సమాచారం ఇవ్వకపోవటం, వాయిదాలు కోరటం పర్యవసానంగా దేశంలో చాలా కేసులు పెండింగ్‌లో పడుతున్నాయి.**


వాస్తవానికి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, రహదారుల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా ఉన్న ఫుట్‌పాత్‌ల సంఖ్యను క్రోడీకరించినట్టు లేదు. ఫుట్‌పాత్‌ల నిర్మాణం, నిర్వహణ సాధారణంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నిర్వహణలో ఉంటాయి. కేంద్రం తల్చుకుంటే ఈ వివరాలు సేకరించి జాతీయ స్థాయి డేటా రూపొందించగలదు. కానీ ఆ అవసరం ఉందని భావించాలి గదా! ఫుట్‌పాత్‌లు అనేవి మన దేశంలో బ్రహ్మపదార్థం లాంటివి. రోడ్డుపక్కన ఎక్కడో ఒకచోట ఇటుక, సిమెంట్, టైల్స్ శిథిలాలుంటే ఒకప్పుడు ఇక్కడ ఫుట్‌పాత్ ఉండేదని అనుకోవటం తప్ప చాలాచోట్ల వాటి జాడ కనబడదు. నగరాలూ, పట్టణాల్లో రోడ్డెక్కిన పాదచారి క్షేమంగా ఇంటికి తిరిగి వెళ్లటం కోసం దారిలో గోతులు, రాళ్లురప్పలూ ఉన్నాయేమో జాగ్రత్తగా చూసుకుంటూ నడవక తప్పని స్థితి. వీటి సంగతలావుంచి ట్రాఫిక్ రద్దీ సమయాల్లో ద్విచక్రవాహనదారులు అసహనంతో ఆ నడకదారులను సైతం కాజేస్తారు.

ఇక చిన్నాచితకా వ్యాపారాలు చేసుకునేవారు సరేసరి. హైదరాబాద్‌లో మెట్రో రైల్ వచ్చాక స్టేషన్లకు అటూ ఇటూ ఫుట్‌పాత్‌లపై రెస్టారెంట్లు వెలిసి పాదచారుల్ని సవాలు చేస్తున్నాయి. తోపుడు బండి లేదా సైకిళ్లపై వ్యాపారాలు చేసుకునేవారిని అప్పుడప్పుడు ట్రాఫిక్ పోలీసులు అదిలించటం కనబడుతుంది. కానీ మెట్రో స్టేషన్ల దగ్గరుండే రెస్టారెంట్ల జోలికి ఎవరూ వెళ్లిన దాఖలా లేదు. ఇక దేశంలోని ఆరు లక్షల గ్రామాల్లో ఫుట్‌పాత్‌ల సదుపాయంగల ఊళ్లు కనీసం వందల సంఖ్యలోనైనా ఉంటాయా అన్నది సందేహమే. వాటి సంగతలావుంచి దేశ రాజధాని నగరంలో 44 శాతం రోడ్లకు ఫుట్‌పాత్‌లు లేవని ఆమధ్య ఢిల్లీ ఐఐటీ నివేదిక తెలిపింది. ఉన్నచోటైనా దాదాపు 28 శాతం మాత్రమే ఇండియన్ రోడ్ కాంగ్రెస్(ఐఆర్‌సీ) నిబంధనలకు అనుగుణమైనవని ఆ నివేదిక తేల్చిచెప్పింది.

ఈ తీర్పు వెలువరించటానికి దారితీసిన కేసు విషాదకరమైనది. అయిదేళ్ల బాలుడిని అతని తండ్రి పాఠశాల సమీపంలో దించి వెళ్తుండగా హఠాత్తుగా వచ్చిన ట్యాంకర్ ఆ బాలుడిపైకి దూసుకెళ్లి ప్రాణాలు తీసింది. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వాలు కదిలితే ఇలాంటి విషాదాలను నివారించవచ్చు. అయితే బాధాకరమైన విషయమేమంటే... ఈ హక్కు అమల్లోకి రావాలంటే పౌరులు నెరవేర్చాల్సిన విధులు చాలా ఉంటాయి. ఫలానాచోట ఫుట్‌పాత్ లేదని సంబంధిత అధికారికి లిఖితపూర్వక ఫిర్యాదు చేసి, ఈ తీర్పును ఉటంకించాలి. అటు తర్వాత దాని సంగతేమైందో కనుక్కోవాలి. అవసరమైతే ఆర్టీఐని ఆశ్రయించాలి. అటు తర్వాత ఫుట్‌పాత్ లేనిచోట పరిస్థితిని తెలిపే ఫొటోతో హైకోర్టులో పిల్ దాఖలు చేయాలి. అందులో తీర్పు వెలువడటానికి దీర్ఘకాలం వేచిచూడాలి. విద్యాహక్కు చట్టం, పనిచేసే హక్కు చట్టంవంటివి ఆచరణలో ఎలా నీరుగారుతున్నాయో కనబడుతూనే ఉంది. ఏ హక్కు అమలు కావాలన్నా పౌరులంతా ఒక్కటై ఉద్యమించటమే, ప్రభుత్వాలపై ఒత్తిళ్లు తీసుకురావటమే మార్గం.

# మరస్పర్శ మానవస్పర్శను మించగలదా!

భారతదేశపు నేటి రాజకీయ నాయకులకు 'కృత్రిమ మేధ' ఒక ఊతపదమైపోయింది. కొందరైతే అనాదిగా వస్తున్న 'మానవ కేంద్రీకృత ప్రజారోగ్య సంరక్షణ' కంటే ఈ కృత్రిమమేధతో కూడిన మరబొమ్మల వైద్య సంరక్షణే మెరుగన్న ఆపోహతో మాట్లాడుతున్నారు. ఇదిగో పులి అంటే అదిగో తోక అన్నట్టు, ఏకంగా భవిష్యత్తులో కృత్రిమమేధతో కూడిన ఆసుపత్రులు, రోగ పరీక్షా కేంద్రాలు, మందుల దుకాణాలూ తెరిచేస్తామనే బీరాలు పలికేంతవరకూ విషయం వెళ్లిపోయింది.వైద్య విధానమంతా ఇద్దరు వ్యక్తులతో ముడిపడి ఉంటుంది. మొదటి వ్యక్తి– నిజంగా రుగ్మత ఉన్న, లేదా ఉందని భావిస్తున్న రోగి. రెండో వ్యక్తి– వైద్యుడు. వీరిరువురి మధ్య వ్యవహారాన్నే వైద్య పరిభాషలో మనం సంప్రదింపు (కన్సల్టేషన్) అంటున్నాం. ఆధునిక వైద్య చికిత్సా విధివిధానం ఇలా ప్రాథమికంగా వినడం, మాట్లాడటం, స్పృశించడం, వైద్యునికీ రోగికీ నడుమ కాలాతీతమైన ఒక బాంధవ్యాన్ని నెలకొల్పడం అనే నాలుగు మూలస్తంభాలపై ఆధారపడి ఉంది. టెక్నాలజీ పెరిగేకొద్దీ ఈ విధానంలో కూడా ఎన్నో మార్పులు వచ్చాయి. ఇప్పుడు వైద్యుడు రోగితో మాట్లాడే సమయం తగ్గిపోయింది. దానికి బదులుగా, ఉక్కిరిబిక్కిరి చేసే మెడికల్ టెస్టుల ఆధారంగా రోగాన్ని



**నిర్ధారించడం పెరిగింది. ఇప్పుడు ఈ పరిస్థితిలోకి అదనంగా కృత్రిమమేధను కూడా చొప్పిస్తే అది గోరుచుట్టు మీద రోకలిపోటయ్యే ప్రమాదం ఉన్నది.**

వైద్యుడు-రోగి ఇరువురూ రోగనిదాన క్రియలో ఎంతో కీలకం. రోగి బెడ్ వద్దకు వైద్యుడు ఆత్మీయంగా చేరగానే రోగికి కొండంత అండ దొరికినట్టు ఉంటుంది. వైద్యుడి స్పర్శ రోగి దేహానికి అమృత సమానంగా, వైద్యుడి మాట రోగి మనసుపై మంత్రంగా పనిచేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే విశ్వసనీయమైన వైద్యుడు రోగికి ప్రసాదించే ఆ ఒక్క కరస్పర్శ-సంజీవిని. అలాంటిది, ఒక రోబోటిక్ స్పర్శ ఈ సజీవ స్పర్శకు సరితూగుతుందా? అసలైన మానవ స్పర్శను సమూలంగా తొలగించి ఆ లోటును భర్తీ చేయగలుగుతుందా?

ఆధునిక చికిత్సా విధానంలో వైద్యుడు నిర్వహించే మరో పార్శ్వం కూడా ఉంది. రోగనిర్ధారణకు ప్రామాణికాలుగా ఎన్నో విధివిధానాలు, దశలవారీ సూచనలు ఉపలభ్యం అవుతూ ఉండొచ్చు. కానీ అనుభవజ్ఞుడైన వైద్యుడు వీటన్నింటినీ గుడ్డిగా అనుసరించడు. తన తెలివినీ, విజ్ఞానాన్నీ, ఏళ్ల తరబడి గడించిన అపారమైన అనుభవాన్నీ రంగరించి ఒక్కొక్క రోగికీ సంబంధించిన రుగ్మతను అతడి ప్రత్యేక శరీర ధర్మానుగుణంగా నిర్ధారిస్తాడు. హెచ్చుతగ్గులను బేరీజు వేసి మరీ తగిన చికిత్సను సూచిస్తాడు. ఎందుకంటే, అన్నింటినీ ఒకే రాటకు కట్టలేం. ఒకే రోగానికి వేరు వేరు వ్యక్తులు వేరు వేరు విధంగా ప్రతిస్పందిస్తారు. ఆ స్పందించిన తీరుపై ఆధారపడి వైద్యుడి చికిత్స ఉంటుంది. అది ఎప్పుడూ ఎవరికి తగ్గట్టు వారికిగా వ్యక్తిగతీకరించబడి ఉంటుంది. అంతేతప్ప, జనసామాన్యంగా, 'పిడుగుకు, బియ్యానికి ఒకే మంత్రం'లా, ఒక మూసలో పోసినట్టు ఉండదు. ఇలాంటి నైశిత్యం మరమనిషి తరం కాదు!

సమగ్ర బుద్ధితో, సందర్భ శుద్ధితో, ఏళ్ల తరబడి అనుభవంతో వైద్యుడు చేసే రోగ నిర్ధారణ విధానంతో కృత్రిమ మేధ ఎన్నటికీ తలపడలేదు. తన విషయ సంపదతో రోగనిర్ధారణ సమయంలో కచ్చితత్వానికి కొంత ఆలంబనగానూ, శస్త్ర చికిత్సలో మర చేతుల చేత సునిశితత్వాన్ని సాధించే ఒక విలువైన పనిముట్టుగానూ మాత్రమే ఆధునిక వైద్యుడికి ఈ కృత్రిమమేధ ఉపయోగపడుతుంది. ఆ పరిధికి మాత్రమే కృత్రిమమేధ ఉపయోగాన్ని కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే, నేటి వైద్యంలో అవధులు దాటిన కృత్రిమమేధ వినియోగం సృష్టించే ఆపదలు ఎన్నో మనం ఇప్పటికే కళ్లారా చూస్తున్నాం, చెవులారా వింటున్నాం. కొందరు రోగులు కృత్రిమ మేధ సహాయంతో తమకు తామే రోగ నిర్ధారణను పూర్తి చేసేసుకుని, ఆ తర్వాత మొక్కుబడిగా, 'శంఖంలో పోస్తేనే గానీ తీర్థం కాదన్న'ట్టుగా మాత్రమే వైద్యుడి దగ్గరకు వస్తున్నారు. ఈ ఒరవడి ఎంతో ప్రమాదకరం. నా స్వానుభవం ఒకటి ఇక్కడ చెప్పదలచాను. ఒక మహిళకు మొహం మీద పెద్ద ప్రమాదం లేని దద్దుర్లు వచ్చాయి. కానీ ఆమె కృత్రిమ మేధను వాడి ఆ దద్దుర్లను 'సిస్టెమిక్ లూపస్ ఎరితమటోసిస్' అనే భయంకరమైన ఆటో ఇమ్యూన్ వ్యాధిగా నమ్మింది. ఎంత నచ్చచెప్పినా ఆమె వినలేదు. చివరికి అది SLE కాదని తేల్చడానికి అనవసరంగా ఎన్నో పరీక్షలను ఆమెకు చేయించాల్సి వచ్చింది. ఆ ఫలితాలన్నీ నెగిటివ్‌గా వచ్చాక గానీ ఆమె ఊపిరి పీల్చుకోలేదు. ఇలా కృత్రిమమేధపై పూర్తిగా ఆధారపడిపోయిన అజ్ఞానంతో ఎందరో అనవసర వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. కృత్రిమమేధ ఆధునిక వైద్య విజ్ఞానాన్ని మెరుగుపరిచే ఒక అనుబంధంగా ఉపయుక్తం కావచ్చు. కానీ దాని స్థానాన్ని పూర్తిగా ఆక్రమించగలిగే ఒక ప్రత్యామ్నాయం మాత్రం ఎన్నటికీ కాలేదు. ఇది ముమ్మాటికి నిజం.

# అవే చదువులు... అవే సమస్యలు!

చిన్నారులంతా మళ్లీ బడిబాట పట్టారు. మరి, ఇన్నాళ్లుగా వేధిస్తున్న పాత సమస్యల మాటేమిటి? విద్యార్థుల ప్రగతి, అభ్యసన స్థితిగతులపై అధ్యయనాలు చేపట్టడమే తప్ప, వాటిని చక్కదిద్దడానికి అవసరమైన సంస్కరణల జాడేది? ఇలాంటప్పుడు ఇక కొత్త విద్యా సంవత్సరంలోనైనా మన చదువులు మెరుగుపడతాయని ఎలా భావించగలం?పాఠశాల విద్యకు నిరంతర సవాళ్లు తప్పడం లేదు. విద్యార్థుల నమోదు తగ్గడం, పాఠశాలల రేషనలైజేషన్, అభ్యసనలేమి, పిల్లలను ఆకట్టుకోలేని సంప్రదాయ బోధన, మార్కులపైనే తల్లిదండ్రుల ధ్యాస.. ఇలా అడుగడుగునా ఎన్నో సమస్యలతో పాఠశాల విద్య కొట్టుమిట్టాడుతోంది. దశాబ్దాలు గడుస్తున్నా, నిర్బంధ ప్రాథమిక విద్యా హక్కు ప్రణాళికలు అమలవుతున్నా, విద్యార్థులు తమ తరగతి స్థాయి అభ్యసనా సామర్థ్యాలను సైతం సాధించలేని స్థితిలో ఉన్నారనేది సుస్పష్టం. ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం సుమారు 75శాతం మంది 9వ తరగతి విద్యార్థులు చిన్న చిన్న కాన్సెప్ట్‌లను కూడా అర్థం చేసుకోలేని దుస్థితిలో ఉన్నారు. చిన్న గణిత సంబంధిత సమస్యలను కూడా పరిష్కరించలేకపోతున్నారు. దేశంలో సుమారు 47శాతం మూడో తరగతి విద్యార్థులు చిన్న కథనూ చదివి అర్థం చేసుకోలేరు. ఎన్ని నూతన విద్యా



**విధానాలు వచ్చినా, సరికొత్త పథకాలు, ప్రణాళికలను రచించినా విద్యార్థుల అభ్యసనా సరళి మారకపోతే దేశం అనుకున్న ఫలితాలను సాధించలేదు. వికసిత భారత్ లక్ష్యాలను చేరుకోలేదు. 21వ శతాబ్దపు నైపుణ్యాలను పుణికి పుచ్చుకునేలా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం నేటి అవసరం.**

**పల్లెల్లో మరీ అధ్వానం!**

గ్రామీణ ప్రాంతాల్లో విద్యా పరిస్థితులు మరింత సంక్లిష్టంగా ఉంటున్నాయి. పూర్వ ప్రాథమిక విద్యపై చాలామంది తల్లిదండ్రులకు అవగాహన కొరవడుతోంది. అంగన్వాడీ కేంద్రాలకు 36 ఏళ్ల వయసు కలిగిన పిల్లలను పంపినా అక్కడ చాలాచోట్ల పూర్వ ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం ఇవ్వట్లేదు. చిన్నారులు ఆరో ఏట ఒకటో తరగతిలో ప్రవేశించేనాటికి పటిష్ఠ పునాది లేకపోవడం విద్యార్థి ప్రగతికి ప్రతిబంధకమవుతోంది. ముఖ్యంగా వలసలు, భాషాపరమైన అడ్డంకులు, డ్రాప్‌అవుట్ విద్యార్థులను ప్రత్యేక బోధనతో ప్రోత్సహించక పోవడం, పాఠశాలలు సిలబస్ పూర్తి చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతుండటంతో అభ్యసనలో వెనకబడిన పిల్లలు ఇంకా వెనకంజ వేస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆచరణాత్మక విద్యా ప్రక్రియలను అనుసరించకుండా మూసవిధానంలో సంప్రదాయ రీతిలో బోధిస్తుండటంతో సవాళ్లు తప్పడంలేదు. 14 శాతం ఉపాధ్యాయుల పనిసమయమంతా బోధనేతర కార్యక్రమాలకే సరిపోతోందని నీతిఆయోగ్ నివేదిక పేర్కొంది. పెద్దసంఖ్యలో ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగుతుండటంతో బహుళ తరగతుల బోధన వంటి సమస్యల వలయంలో పాఠశాల విద్య నలిగిపోతోంది. దీనివల్ల విద్యార్థులు కనీస సామర్థ్యాలనూ సాధించలేక బడి మానేసి బాల కార్మికులుగా మారిపోయే ప్రమాదం ఉంది.

పాఠశాల యాజమాన్యాలు బోధన సరళిలో మార్పులు చేసుకోవాలి. విద్యార్థుల నేపథ్యాలను పరిగణనలోకి తీసుకుని, స్నేహపూరిత వాతావరణంలో బోధన చేపట్టాలి. పాఠ్యాంశం పూర్తికాగానే రోజువారీగా, నెలవారీగా ప్రతిభను అంచనా వేసి అవసరమైతే అదనపు శ్రద్ధతో అభ్యసనకు ఆసరాగా నిలబడాలి. ఆచరణాత్మక, ప్రాజెక్ట్ ఆధారిత బోధనతో కాన్సెప్ట్‌లు అర్థమయ్యేలా బోధించడం తప్పనిసరి.

కేవలం సిలబస్ వెనకే పరుగులు తీస్తే, తరగతి గదిలోని విద్యార్థులందరికీ న్యాయం జరగదు. స్నేహపూరిత వాతావరణంతో విద్యార్థులకు భరోసా కల్పిస్తూ సృజనాత్మకంగా చదువు చెప్పాలి. పూర్వ ప్రాథమిక విద్యలో మెరుగైన శిక్షణ ద్వారా విద్యార్థులను ప్రాథమిక విద్యకు సంసిద్ధం చేయాలి. ముఖ్యంగా బడుల్లో మౌలిక వసతులు మెరుగవ్వాలి. స్వచ్ఛమైన తాగునీరు, బాలబాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు, పరిశుభ్రత, వివక్ష లేని వాతావరణం వంటి వాటితో విద్యార్థులూ ఉపాధ్యాయులకు బడిని సురక్షిత ప్రాంగణంగా తీర్చిదిద్దాలి. ప్రభుత్వాలు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల నేపథ్యాలను పరిగణనలోకి తీసుకుంటూ ఒత్తిడి లేని విద్యను అందించాలి. ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలు, ఉపాధ్యాయుల నిష్పత్తి సరిగ్గా ఉండేలా చూడాలి. సంప్రదాయ బోధనకు స్వస్తి పలికి, విద్యార్థుల సామర్థ్యాల ఆధారిత బోధనను ప్రోత్సహించాలి. సిలబస్ పూర్తిచేయడమనే దృక్పథాన్ని పక్కనపెట్టి, పిల్లలకు సరైన సమయంలో సరైన పంథాలో నేర్పించడంపై దృష్టిపెట్టాలి. ఆరో తరగతి నుంచి వృత్తివిద్యను పాఠ్యాంశాల్లో పొందుపరుస్తూనే, డిజిటల్ విద్యను ప్రోత్సహించాలి. కంపోజిట్ పాఠశాలల ద్వారా 112వ తరగతులను ఒకే ప్రాంగణంలో ఒకే యాజమాన్యంలోకి తీసుకురావాలి. ఇలాంటివి అమలైతేనే అభ్యసన ప్రక్రియ మెరుగవుతుంది. పాఠశాలలు, విద్యార్థుల ప్రగతి ప్రయాణంలో తల్లిదండ్రులను, యాజమాన్య కమిటీలను భాగస్వామ్యం చేయడం ద్వారా సత్ఫలితాలను సాధించవచ్చు.

## సంక్షోభం నుంచి తక్కువ

# భారంతో బయటపడ్డాం




జైపూర్, జులై 04, అనంతజనశక్తి న్యూస్

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా ఎదుర్కొందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రభుత్వ విధానాలు, ఇంధన దిగుమతుల్లో వైవిధ్యం పాటించడం, బలమైన ద్వైపాక్షిక సంబంధాలతో సంక్షోభం నుంచి తక్కువ భారంతో బయటపడ్డామన్నారు. రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లా పచ్‌పద్రాలో.. దేశంలోనే తొలి గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీపెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించారు. దాంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ..''పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభానికి ముందు భారత్ 2526 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకుంది. సంక్షోభ సమయంలో ఆ సంఖ్యను 40కి పైగా దేశాలకు పెంచాం. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరగడంతో ఏప్రిల్ నుంచి జూన్ వరకు చమురు కంపెనీలకు రూ.75 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. ఆ భారాన్ని ప్రభుత్వమే భరించింది. ప్రజలపై భారం పడకుండా లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాం. ప్రస్తుతం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ సామర్థ్యం గల దేశంగా భారత్ ఎదిగింది. భారత్ విఫలమవుతుందని కొందరు విష ప్రచారం చేశారు. ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలూ జరిగాయి. కానీ అవేమి ఫలించలేదు. భారత్ విఫలమవుతుందని ఆశించిన వారు ఇప్పుడు తీవ్ర నిరాశలో ఉన్నారు. భాజపా ప్రభుత్వాలు కేవలం శంకుస్థాపనలు చేసి వదిలేయవు. పనులు పూర్తయ్యే వరకు నిరంతరం కృషి చేస్తాయి.'' అని పేర్కొన్నారు.

**వాళ్లంతా తప్పుదోవ పట్టించారు**

పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోదీ అన్నారు. శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర రిఫైనరీపెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను మోడీ ప్రారంభించారు. సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పెట్రోకెమికల్స్, రైల్వేలు, రహదారులు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రత, పశ్చిమాసియా యుద్ధం సమయంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు.
పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో భారత్‌లో ఇంధన కొరత వస్తుందని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆరోపించారు. ''ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరిగాయి. రాజకీయాలు చేశారు. కానీ వారి కుట్రలు ఫలించలేదు. కొన్ని చిన్న చిన్న ఇబ్బందులు తప్ప దేశంలో ఎక్కడా ఇంధన సరఫరా ఆగలేదు.'' అని అన్నారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించిందని పేర్కొన్నారు. భారత్‌కు పెద్దగా చమురు నిల్వలు లేవని గుర్తుచేసిన ప్రధాని.. యుద్ధం సమయంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరిగిందన్నారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 4050 శాతం పెరగడమే కాకుండా రేషన్ విధానం కూడా అమలు చేశారని చెప్పారు. అయితే భారత్‌లో మాత్రం ఒక్కరోజు కూడా ఇంధన కొరత తలెత్తలేదని స్పష్టం చేశారు. సంక్షోభానికి ముందు భారత్ కేవలం 2526 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని.. కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత దౌత్యపరమైన ప్రయత్నాల వల్ల 40కిపైగా దేశాల నుంచి చమురు, ఇంధనం దిగుమతి చేసుకున్నామని ప్రధాని వెల్లడించారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే భారత్‌కు అత్యంత ప్రాధాన్యం అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామని అన్నారు. భారత్‌కు అవసరమైన ఎల్పీజీలో దాదాపు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చేదని.. అందులో 90 శాతం హోర్ముజ్ జలసంధి మార్గంలో గల్ఫ్ దేశాల నుంచే వచ్చేదని తెలిపారు. యుద్ధం కారణంగా సరఫరా దాదాపు నిలిచిపోయిన సమయంలో రిఫైనరీల సామర్థ్యాన్ని వినియోగించి కేవలం ఏడు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 35 వేల మెట్రిక్ టన్నుల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. ఇప్పటివరకు ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని రిఫైనరీలను కూడా ఈ అవసరానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు.
దేశవ్యాప్తంగా పైప్ ద్వారా సహజ వాయువు (PNG) కనెక్షన్లను వేగంగా విస్తరించామని, 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్లు అందించామని ప్రధాని వెల్లడించారు.మార్కెట్ అంచనాల ప్రకారం గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,000 వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రూ. 950లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైందన్నారు. ''సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకున్నాం. దేశ వనరులను సమర్థంగా వినియోగించాం. దౌత్య శక్తిని సానుకూలంగా ఉపయోగించాం. అందుకే భారత్ ఈ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించింది.'' అని చెప్పారు.
ఇర పచ్‌పద్రా రిఫైనరీతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా మరింత బలోపేతమవుతోందని ప్రధాని తెలిపారు. ఈ సమగ్ర రిఫైనరీకి ఏడాదికి 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. ఇది దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అదనంగా జైపూర్ మెట్రో రెండో దశ, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, బికానేర్ సోలార్ పార్కులు, విద్యుత్ ప్రసార లైన్లు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని దేశానికి అంకితం చేశారు.

# టెలిగ్రామ్‌కు కేంద్రం నోటీసు



న్యూఢిల్లీ, జులై 04, అనంత జనశక్తి న్యూస్

సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, ఇతర కాపీరైట్ కంటెంట్ పైరసీని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రముఖ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌కు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నోటీసు జారీ చేసింది. పైరసీ కంటెంట్‌ను వెంటనే తొలగించి, తీసుకున్న చర్యలపై 15 రోజుల్లోగా "యాక్షన్ టేకెన్ రిపోర్ట్" సమర్పించాలని ఆదేశించింది.
భారత క్రియేటర్ ఎకానమీ, సినీ పరిశ్రమ, టెలివిజన్ ప్రసార సంస్థలు, ఓటీటీ వేదికలు, నిర్మాతలు, పంపిణీదారుల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు కేంద్రం పేర్కొంది. పైరసీకి పాల్పడుతున్న ఛానళ్లు, గ్రూపులు, బాట్లు, ఖాతాలు, అడ్మినిస్ట్రేటర్లు, అనుబంధ సంస్థలపై కూడా టెలిగ్రామ్ కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది.
ఈ మధ్యకాలంలో పలు ఓటీటీ సంస్థలు, కంటెంట్ యజమానులు కేంద్రానికి ఫిర్యాదులు చేశారు. తమ కాపీరైట్ కలిగిన సినిమాలు, వెబ్‌సిరీస్‌లు టెలిగ్రామ్‌లో అనుమతి లేకుండా విస్తృతంగా షేర్ అవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఫిర్యాదులను పరిశీలించిన కేంద్రం మొత్తం 3,142 టెలిగ్రామ్ ఛానళ్లు పైరసీ కంటెంట్‌ను పంపిణీ చేస్తున్నట్లు గుర్తించింది. దీనితో సమాచార సాంకేతిక చట్టం 2000 కింద టెలిగ్రామ్‌కు నోటీసులు జారీ చేశారు. కాపీరైట్ ఉల్లంఘనలకు సంబంధించిన కంటెంట్‌ను తొలగించడంతో పాటు.. మధ్యవర్తి సంస్థగా తన బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కేంద్రం స్పష్టం చేసింది.
సమాచార సాంకేతిక (ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) నిబంధనలు 2021 ప్రకారం, ప్రభుత్వం లేదా కోర్టు నుంచి ఆదేశాలు వచ్చినప్పుడు అక్రమ కంటెంట్‌ను తొలగించడం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు తప్పనిసరి. ఈ నిబంధనలను టెలిగ్రామ్ కచ్చితంగా అమలు చేయాలని కేంద్రం తెలిపింది. అలాగే.. ప్రతి పైరసీ ఛానల్‌ను ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి చెప్పే వరకు వేచి ఉండకూడదని కూడా కేంద్రం హెచ్చరించింది. టెలిగ్రామ్ స్వయంగా పర్యవేక్షణ చేపట్టి, పైరసీ కార్యకలాపాలను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని పేర్కొంది. గత కొంతకాలంగా టెలిగ్రామ్‌పై భారత్‌లో పలు వివాదాలు తలెత్తుతున్నాయి. మోసాలు, వ్యక్తుల పేర్లతో నకిలీ ఖాతాల నిర్వహణ, సున్నితమైన సమాచార ప్రసారం వంటి అంశాలపై ఇప్పటికే కేంద్రం నిఘా పెంచింది. ముఖ్యంగా నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ, తప్పుడు సమాచారం వ్యాప్తి వంటి ఆరోపణల నేపథ్యంలో టెలిగ్రామ్ సేవలపై గతంలో కేంద్రం తాత్కాలికంగా నిషేధం కూడా విధించింది. ఇప్పుడు పైరసీ అంశంపై కేంద్రం తీసుకున్న తాజా చర్యతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల బాధ్యతపై ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరిస్తోందని స్పష్టంగా కనపడుతుంది.

# లెక్కలు చెప్పండి.. చర్చకు రండి

**- అమరావతిపై ప్రభుత్వానికి పేర్ని నాని సవాల్**

**- అమరావతి ఎప్పుడు పూర్తవుతుందో..**

**- మొత్తం ఎంత ఖర్చవుతుందో..**

అమరావతి, జులై 04, అనంతజనశక్తి న్యూస్

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని అమరావతి రాజధాని నిర్మాణం, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. అమరావతి ఎప్పుడు పూర్తవుతుందో, మొత్తం ఎంత ఖర్చవుతుందో, తీసుకున్న అప్పులకు ఎంత వడ్డీ చెల్లించాల్సి వస్తుందో ప్రభుత్వం స్పష్టంగా చెప్పడం లేదని ఆయన ఆరోపించారు. ఈ అంశాలపై ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని అన్నారు. అమరావతిని తొమ్మిది నగరాల రాజధానిగా చెబుతూ ఇప్పుడు ఒక మున్సిపాలిటీ స్థాయికే పరిమితం చేస్తున్నారని పేర్ని నాని విమర్శించారు. 2015లో టెండర్లు పిలిచి, 2016లో శంకుస్థాపన చేసిన భవనాలను 2028లో ప్రారంభిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాజధానిలో నిర్మించిన భవనాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరెవరు నివసిస్తారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన విధంగా ప్రభుత్వ భూములు లేదా కొనుగోలు చేసిన భూముల్లోనే రాజధాని ఏర్పాటు చేసి ఉంటే తక్కువ వ్యయంతో పూర్తయ్యేదని పేర్ని నాని పేర్కొన్నారు. ప్రస్తుతం వేల కోట్ల రూపాయల అప్పులు చేసి అమరావతి నిర్మాణం చేపడుతున్నారని, భవిష్యత్తులో ఈ భారం రాష్ట్ర ప్రజలపైనే పడుతుందని విమర్శించారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ అనే వాదన వాస్తవానికి విరుద్ధమని అన్నారు. అమరావతిలో మౌలిక సదుపాయాల నిర్వహణ, వర్షాకాలంలో నీటి పారుదల వంటి అంశాలపై కూడా ఆయన సందేహాలు వ్యక్తం చేశారు. ఇప్పటికే భారీ అప్పులు చేసిన ప్రభుత్వం భవిష్యత్తులో వాటిని ఎలా తీర్చబోతుందో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.
రైతుల సమస్యలను తెలుసుకునేందుకు అమరావతి ప్రాంతంలో పర్యటిస్తామని, తమను అడ్డుకునే ప్రయత్నాలు జరిగినా వెనక్కి తగ్గబోమని పేర్ని నాని స్పష్టం చేశారు. అలాగే చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ అమరావతికి సంబంధించిన ఆస్తుల వివరాలు, ఖర్చుల లెక్కలు ప్రజలకు వెల్లడించాలని కోరారు. అమరావతి అంశంతో పాటు రాష్ట్రంలోని ఇతర పరిణామాలపైనా పేర్ని నాని స్పందించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. మత్స్యకారుల డీజిల్ పంపిణీ, పోలీసుల వ్యవహారశైలి, డీఎస్సీ, లాకప్ డెత్ వంటి అంశాలపై కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తాము లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం లెక్కలతో సమాధానం చెప్పాలని, అవసరమైతే బహిరంగ చర్చకు సిద్ధంగా రావాలని పేర్ని నాని సవాల్ విసిరారు.



## బంగాళాఖాతంలో అల్పపీడనం

# పలు జిల్లాలలో భారీ వర్షాలు

**- వాతావరణ శాఖ హెచ్చరిక**

**- ఆదివారం ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు**

అమరావతి, జులై 04, అనంతజనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్య గమనిక. బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతున్నట్లు వెల్లడించింది. వచ్చే రెండు, మూడు రోజుల్లో అల్పపీడనం ఒడిశా, ఛత్తీస్ గఢ్ వైపుగా పయనించే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. వచ్చే రెండు రోజులు ఆంధ్రప్రదేశ్‌పై ఈ ప్రభావం కొనసాగుతోందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. మరోవైపు రాజస్థాన్ నుంచి మధ్యప్రదేశ్ వరకూ విస్తరించి ఉన్న నైరుతి రుతుపవన ద్రోణి.. వచ్చే 3 రోజులలో ఒడిశా, ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రం వైపు కొనసాగుతుందని వెల్లడించారు.
రుతుపవన ద్రోణి ప్రభావంతో అల్లూరి జిల్లా, ఏలూరు, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలలో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలో మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో వర్షం కురవవచ్చని తెలిపారు. తీరం వెంబడి 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అల్పపీడనం నేపథ్యంలో మరో నాలుగు రోజులు మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. మూడో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలను విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం హెచ్చరించింది.

**ఆదివారం ఈ జిల్లాలలో వానలు..**

మరోవైపు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆదివారం రోజున మేఘావృతమైన వాతావరణం ఉంటుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అల్లూరి, పోలవరం జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. గంటకు 4050 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడవద్దని ప్రఖర్ జైన్ సూచించారు.





# కృష్ణాజిల్లాలో విషాదం

**- ఒకే ఇంట్లో ముగ్గురు మహిళల ఆత్మహత్య**

**- ఉరివేసుకుని బలవన్మరణం**

అమరావతి, జులై 04, అనంతజనశక్తి న్యూస్

కృష్ణా జిల్లాలోని గూడూరు మండలం అనంతయ్యపేట గ్రామంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఒకే ఇంట్లో ముగ్గురు మహిళలు హనుమకొండ రజిని కుమారి, మధుబాల, గౌరీదేవి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు మహిళల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన వెనుక కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యలు లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలపై గూడూరు పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల నుంచి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## ధైర్యముంటే భాజపాలో

# చేరి మాట్లాడండి

**రెబల్స్‌కు మమతా బెనర్జీ సవాల్**

న్యూఢిల్లీ, జులై 04, అనంత జనశక్తి న్యూస్

తృణమూల్ కాంగ్రెస్‌లో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. భాజపా తమ పార్టీలో చీలికలపై దృష్టి పెట్టిందన్నారు. టీఎంసీలో చోటుచేసుకుంటున్న మార్పులకు కాషాయ పార్టీనే కారణమని, అసమ్మతి నేతలను రెచ్చగొడుతోందన్నారు. తమ పార్టీలో నిజాయతీ లేని కొందరు నేతలు భాజపాకు అమ్ముడుపోయారని ఆరోపించారు. ధైర్యముంటే నేరుగా భాజపాలో చేరి తనను ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. తృణమూల్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రిమా భట్టాచార్య రాజీనామా.. తదనంతర పరిణామాల నేపథ్యంలో మమతా బెనర్జీ సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు.
అంతకుముందు.. మమతా బెనర్జీకి సన్నిహితురాలిగా పేరున్న చంద్రిమా బెంగాల్ తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. పార్టీలో అన్ని బాధ్యతల నుంచి వైదొలుతున్నట్లు ప్రకటించారు. విశ్వాసం లేనిచోట పనిచేయడం సాధ్యంకాదని.. అందుకే పార్టీని వీడుతున్నట్లు చెప్పారు. అయితే, రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎన్నికైన నెల రోజులకే ఆమె రాజీనామా చేయడం గమనార్హం. మరోవైపు, ఈ నిర్ణయం ప్రకటించిన కొన్ని నిమిషాల్లోనే రెబల్ నేతలతో కలిసి ఓ సమావేశంలో చంద్రిమా పాల్గొనడం గమనార్హం.

**అందుకే రాజీనామా చేశా.. చంద్రిమా భట్టాచార్య**

''మమతా బెనర్జీకి నాపై విశ్వాసం సన్నగిల్లినట్లు కనిపించింది. నాపై నమ్మకం లేనప్పుడు పార్టీ కార్యకర్తగా కొనసాగడం కష్టం. కొందరు నేతలు నా నిజాయతీని ప్రశ్నిస్తున్నారు? నా గురించి మమతా బెనర్జీకి అన్నీ తెలుసు'' అని చంద్రిమా పేర్కొన్నారు. గతంలో ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసిన ఆమెను జూన్ 3న పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా దీదీ నియమించిన విషయం తెలిసిందే.

## భర్తను చంపి

# బాత్‌రూమ్‌లో పూడ్చి

**- ఫ్లోర్‌పై టైల్స్ అతికించింది**

**- 45 రోజుల తర్వాత వెలుగులోకి**

**- తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు**

**- ఆగ్రాలోని దొహతోరా ప్రాంతంలో ఘటన**

ఆగ్రా, జులై 04, అనంత జనశక్తి న్యూస్

భర్తకు పాయసంలో నిద్రమాత్రలు కలిపి ఇచ్చిన ఓ మహిళ.. అతడు మత్తులోకి జారుకున్న తర్వాత ఉరేసి చంపింది. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా తన ఇంటి బాత్రూమ్‌లోనే శవాన్ని గొయ్యితీసి పూడ్చిపెట్టి, ఫ్లాసింగ్ చేసి, టైల్స్ అతికించింది. తర్వాత తన భర్త కనిపించకుండా పోయాడని కట్టుకథ అల్లింది. దిగ్భ్రాంతికర ఈ ఘటన ఉత్తర్ ప్రదేశ్‌లోని ఆగ్రాలో వెలుగుచూసింది. ఏ పనిచేయకుండా మద్యానికిపై బానిసై నిత్యం వేధిస్తున్నాడని ఆమె ఈ దారుణానికి పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే.. ఆగ్రాలోని దొహతోరా ప్రాంతంలో సురేంద్ర శర్మ (44), తన భార్య రుబీ శర్మ, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఉంటున్నాడు.
మే 26న ఆయన భార్య రుబీ శర్మ.. తన భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి అతడి ఆచూకీ కోసం గాలించారు. సాధారణ పోలీసు వెరిఫికేషన్ సమయంలో ఆమె ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో భార్య ఘాతకం బయటపడింది. పోలీసుల కథనం ప్రకారం.. సురేంద్ర శర్మకు రుబీతో 16 ఏళ్ల కిందట వివాహం జరిగింది. అయితే, హత్య జరిగిన రోజు తన ఇద్దరు కుమార్తెను సురేంద్ర అన్నయ్య ఇంటికి పంపింది. ఆ రోజు రాత్రి భర్తకు పాయసంలో నిద్రమాత్రలు కలిపి ఇచ్చింది. సురేంద్ర స్పృహ కోల్పోయిన తర్వా అతడిని గొంతు నులిమి చంపినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. మరుసటి రోజు ఉదయం నేరాన్ని దాచిపెట్టేందుకు బాత్‌రూమ్‌లో ఒక గొయ్యి తవ్వి, మృతదేహాన్ని పూడ్చిపెట్టి, దానిపై సిమెంట్‌లో ఫ్లోరింగ్ వేసి, టైల్స్ అంటించినట్టు ఆరోపణలు ఉన్నాయి.

**ఆ తర్వాత 45 రోజుల పాటు రూబీ తన భర్త ఇంటి నుంచి వెళ్లిపోయాడని బంధువులకు, ఇరుగుపొరుగు వారికి చెబుతూ, ఎవరైనా అతడి గురించి అడిగినప్పుడల్లా ఏడుస్తున్నట్టు నటిస్తూ ఉండేది. సురేంద్రకు సంబంధించిన పాత కేసులో సాధారణ తనిఖీ కోసం పోలీసు బృందం ఆ ఇంటికి వెళ్లినప్పుడు ఈ హత్య వెలుగులోకి వచ్చింది. రూబీ ఆందోళనగా ప్రవర్తించడం, తన బావను ఇంటికి పిలవడం అధికారులు గమనించారు. ఇప్పటికే తన సోదరుడి అదృశ్యం, రూబీ ప్రవర్తనపై అనుమానంతో ఉన్న అతడు. తన ఆందోళనలను పోలీసులతో పంచుకున్నారు. సుదీర్ఘ విచారణలో రూబీ హత్యను అంగీకరించి, మృతదేహాన్ని ఎక్కడ పాతిపెట్టిందో వెల్లడించినట్లు సమాచారం. అనంతరం పోలీసులు బాత్రూమ్ నేలను పగలగొట్టి, సురేంద్ర మృతదేహాన్ని వెలికితీసి, పోస్ట్‌మార్టం పరీక్ష కోసం పంపించారు.**

**మే 26న సురేంద్ర అదృశ్యంపై ఫిర్యాదు నమోదైందని ఆగ్రాలోని హరిపర్వత్ సర్కిల్ ఏసీపీ అమీషా తెలిపారు. విచారణలో, భార్యే అతడిని హత్య చేసి, మృతదేహాన్ని బాత్రూమ్ నేల కింద పాతిపెట్టి, సిమెంట్‌తో కప్పివేసినట్లు పోలీసులు కనుగొన్నారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, తదుపరి చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. ఆగ్రా డిప్యూటీ కమిషనర్ సయ్యద్ అలీ అబ్బాస్ మాట్లాడుతూ... ఈ నేరాన్ని రుబీ ఒక్కరే చేశారా? అనేది విచారిస్తున్నట్టు తెలిపారు. శవాన్ని గొయ్యి తీసి పాతిపెట్టడం ఒక్కరి వల్ల అసాధ్యమని, ఆమెకు ఎవరైనా సహకరించారా? అనేది దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.**

# ప్రభుత్వ లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్ అంకిత్



**- వనమహోత్సవం మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు**
**- సీజనల్ వ్యాధుల నివారణకు పారిశుధ్యంపై దృష్టి**
**- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించాలి**
**- క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి**

**భద్రాద్రికొత్తగూడెం ప్రతినిధి, అనంత జనశక్తి న్యూస్ :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న ప్రాధాన్యత కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక, వనమహోత్సవం, సీజనల్ వ్యాధుల నివారణ, పారిశుధ్యం, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి శాఖ నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. వనమహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షిస్తూ నీటి వసతి, ట్రీ గార్డులు ఏర్పాటు చేసి వాటి మనుగడపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, యాంటీ లార్వా చర్యలు, ఫాగింగ్ నిర్వహించాలని తెలిపారు. నిల్వ నీరు లేకుండా చూడడంతో పాటు ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం, వంటశాలల పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని చెప్పారు. అర్హులైన విద్యార్థులకు యూనిఫాం లను సకాలంలో పంపిణీ చేయాలని ఆదేశించారు.

అధికారులు క్షేత్రస్థాయిలో తరచూ పర్యటిస్తూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# తాటిపాముల పెద్దమ్మ ఆలయానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రూ.3 లక్షల విరాళం



**వనపర్తి, జూలై 4:అనంత జనశక్తి న్యూస్**

వనపర్తి నియోజకవర్గంలోని శ్రీరంగాపూర్ మండలం తాటిపాముల గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయాన్ని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు. ఆలయ అభివృద్ధి కోసం తన వంతు సహాయంగా రూ.3 లక్షల విరాళాన్ని ప్రకటించి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ప్రజాసేవతో పాటు దైవ సేవకు కూడా ప్రాధాన్యం ఇస్తూ, పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం వంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తాటిపాముల మాజీ ఎంపీటీసీ వెంకటయ్య నాయుడు కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిరీష, ఉపసర్పంచ్ కురుమన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విష్ణు ముదిరాజ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మేకల అశోక్, బహుజన రమేష్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రాములు, ఎల్లస్వామి, రంజిత్ కుమార్, బుచ్చన్న నాయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గ్రేటర్‌లో మూడు కార్పొరేషన్లపై భాజపా ఫోకస్

**- ఎన్నికల వ్యూహాలు, వనరుల సమీకరణపై కీలక సమావేశం**

**హైదరాబాద్ జూలై 04 అనంత జనశక్తి న్యూస్**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు నగర పాలక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని భారతీయ జనతా పార్టీ (భాజపా) ప్రత్యేక దృష్టి సారించింది. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఎన్నికల వ్యూహాలు, వనరుల సమీకరణ, సంస్థాగత బలోపేతంపై పార్టీ నాయకత్వం కీలక సమావేశం నిర్వహించింది.

**వరంగల్‌పైనా ప్రత్యేక దృష్టి**

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు వరంగల్ నగర పాలక సంస్థ ఎన్నికల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించాలని భాజపా లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్నికలకు ముందుగానే క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని అంచనా వేసేందుకు అంతర్గత సర్వేలు నిర్వహించినట్లు సమాచారం.

**బలహీన ప్రాంతాలపై ప్రత్యేక కార్యాచరణ**

సర్వే నివేదికల ఆధారంగా బలహీనంగా ఉన్న డివిజన్లపై ప్రత్యేక దృష్టి సారించనున్న పార్టీ నాయకత్వం, అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, స్థానిక సమస్యల ఆధారంగా కార్యాచరణ రూపొందించేందుకు సిద్ధమవుతోంది. నగర ప్రాంతాల్లో పార్టీ పట్టును మరింత బలోపేతం చేసి ఎన్నికల్లో విజయాన్ని సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగాలని భాజపా నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# శుభాకాంక్షలు చెప్పిన సంజయ్

**- 20 ఏండ్ల రేవంత్ రాజకీయ ప్రస్తానం**
**- ప్రజా జీవితంలో రెండు దశాబ్దాలు**

**హైదరాబాద్, జూలై 4:అనంత జనశక్తి న్యూస్**

ప్రజా జీవితంలో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈరోజు(శనివారం) మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కూడా కష్టపడి పైకొచ్చినవారే అని అన్నారు. సీఎం రేవంత్ 6 గ్యారంటీలు అమలు చేయాలని కోరారు. SIR పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని కేంద్ర మంత్రి విమర్శించారు. ఇదే జరిగితే తెలంగాణలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదం ఉందన్నారు. మజ్లిస్‌తో కుమ్మక్కై హిందువుల ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. అధికారులకు ప్రభుత్వం సహకరించడం లేదని బండి సంజయ్ పేర్కొన్నారు.

# ఆహార కల్తీపై హైదరాబాద్‌లో ఉక్కుపాదం

**- 100 రోజుల్లో 185 కేసులు నమోదు.. 121.87 టన్నుల కల్తీ ఆహార పదార్థాల స్వాధీనం**

**హైదరాబాద్, జూలై 4,అనంత జనశక్తి న్యూస్**

హైదరాబాద్ నగరంలో ఆహార కల్తీని అరికట్టేందుకు HFAST బృందం దూకుడు పెంచింది. GHMC, ఫుడ్ సేఫ్టీ విభాగంతో కలిసి గత 100 రోజులుగా హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలపై విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించింది.

**247 కేసులు ఫుడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ**

తనిఖీల్లో మొత్తం 185 ఆహార కల్తీ కేసులు నమోదు చేయగా, మరో 247 కేసులను తదుపరి చర్యల కోసం GHMC, ఫుడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ చేశారు. ఈ దాడుల్లో 121.87 టన్నుల కల్తీ ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రాజేంద్రనగర్ జోన్‌లో అత్యధిక ఉల్లంఘనలు

నగరంలోని అన్ని జోన్లలో తనిఖీలు నిర్వహించగా, అత్యధికంగా రాజేంద్రనగర్ జోన్‌లో 55 కేసులు నమోదయ్యాయి.నిబంధనలు ఉల్లంఘించిన హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలపై అధికారులు చర్యలు చేపట్టారు.

**FSSAI లైసెన్స్, పరిశుభ్రత తప్పనిసరి**



హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల నిర్వాహకులు తప్పనిసరిగా FSSAI లైసెన్స్ కలిగి ఉండాలని, ఆహార తయారీ, నిల్వ, విక్రయాల్లో పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానానికి 20 ఏళ్లు..



**- మిడ్జిల్ సభలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**పాలమూరు జూలై 04 అనంత జనశక్తి న్యూస్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ అరంగేట్రం చేసి 20 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మిడ్జిల్‌లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. రాజకీయ జీవితంలో 20 ఏళ్ల మైలురాయిని చేరుకుని రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవలందిస్తున్న రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు..

# యువత ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలి



**- ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

**హైదరాబాద్, జూలై 4:అనంత జనశక్తి న్యూస్**

హైదరాబాద్‌లోని టీహబ్‌లో బవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన "బవర్ యూజీ సమ్మిట్ 2.0"లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు. "నేడు నాకు 18 సంవత్సరాల వయస్సు ఉంటే?" అనే భావనతో నిర్వహించిన ఈ సదస్సులో ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు.

పారిశ్రామిక అవకాశాలపై యువతకు దిశానిర్దేశం

"భారత యువత భవిష్యత్తు – నిర్మాణం, నాయకత్వం మరియు పారిశ్రామిక అవకాశాలు" అనే అంశంపై మాట్లాడిన ఎంపీ, యువత ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా ఉద్యోగాలను కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగడం ద్వారా భారత యువత ప్రపంచ స్థాయిలో రాణించగలరని అన్నారు.

**నాయకత్వం, ఆవిష్కరణలపై దృష్టి**

యువతలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయని ఎంపీ పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ప్రతి విద్యార్థి తన కలలను లక్ష్యాలుగా మార్చుకుని వాటి సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువ పారిశ్రామికవేత్తలు, అధ్యాపకులు, స్టార్టప్ ప్రతినిధులు, విద్యా రంగ నిపుణులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఘనంగా సత్కరించారు.

# హైదరాబాద్‌లో వర్క్ సైట్ స్కూల్స్

**- వలస కార్మికుల పిల్లల కోసం**
**- తెలంగాణ సర్కార్ గొప్ప నిర్ణయం**
**- వినూత్న కార్యక్రమానికి శ్రీకారం**

**హైదరాబాద్, జూలై 4:అనంత జనశక్తి న్యూస్**

దేశంలోని చాలా రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం, పొట్టకూటి కోసం.. చాలా మంది వలస కార్మికులు హైదరాబాద్‌కు వస్తున్నారు. ఉపాధి కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లే కార్మికుల కుటుంబాలకు పిల్లల చదువు పెద్ద సమస్యగా మారుతోంది. నిర్మాణ పనుల కోసం ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే కార్మికుల పిల్లలు తరచూ పాఠశాలలకు దూరం అవుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాల వద్దే వర్క్ సైట్ స్కూళ్లు ఏర్పాటు చేసి చిన్నారులకు విద్యతో పాటు భద్రత కల్పించే వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.




ఇందులో భాగంగా దేశంలోనే తొలి వర్క్ సైట్ స్కూల్‌ను మే 3వ తేదీన నార్సింగిలోని రాజపుష్ప లేబర్ క్యాంపులో ప్రారంభించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం రమేష్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. శ్రీజన ఈ పాఠశాలను ప్రారంభించారు. విద్యాశాఖ, పురపాలక శాఖ, రాజపుష్ప ప్రాపర్టీస్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ పాఠశాలలో 37 మంది చిన్నారులు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చదువుకుంటున్నారు. మొత్తం 53 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వీరిలో ఎక్కువ మంది బిహార్, జార్ఖండ్, ఒడిశా, ఉత్తర్‌ప్రదేశ్, అసోం రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికుల పిల్లలే ఉన్నారు. ఈ వర్క్ సైట్ స్కూళ్లలో ఇంగ్లీష్, మ్యాథ్స్, హిందీ బోధించడంతో పాటు ఆటలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజనం, విరామ సమయాలను కూడా పాఠశాల నిర్వహణలో భాగంగా కల్పిస్తున్నారు.

నిర్మాణ సైట్ల వద్దే ఈ తరగతులు నిర్వహించడం వల్ల పిల్లలు నిర్లక్ష్యంగా లేబర్ క్యాంపుల్లో తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. తల్లిదండ్రులు పనుల్లో ఉండగా చిన్నారులు సురక్షితంగా పాఠాలు నేర్చుకునే అవకాశం కలిగింది. ఇటీవల లేబర్ కాలనీల్లో చిన్నారులపై జరిగిన నేర ఘటనల నేపథ్యంలో వారి భద్రతకు కూడా ఈ పాఠశాలలు ఒక రక్షణ కవచంగా మారుతున్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించేందుకు ఇప్పటికే నార్సింగిలో నవనామి, బీఎస్ఆర్ డెవలపర్స్ నిర్మాణ ప్రాంగణాల్లో మరో 2 వర్క్ సైట్ స్కూళ్లు రెడీగా ఉన్నాయి. భవిష్యత్తులో సైబరాబాద్ పరిధిలోని సుమారు 100 లేబర్ క్యాంపుల్లో ఇలాంటి వర్క్ సైట్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. పిల్లలకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు కొత్త మరుగుదొడ్లు, ప్రత్యేక ఆట స్థలం ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి విద్యార్థికి 3 జతల స్కూల్ యూనిఫాంలను కూడా అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నిర్మాణ కార్మికులు నగర అభివృద్ధికి ఎంత ముఖ్యమో, వారి పిల్లల విద్య కూడా అంతే ముఖ్యమనే సందేశాన్ని ఈ కార్యక్రమం ఇస్తోంది. వలస కార్మికుల పిల్లలు చదువుకు దూరం కాకుండా, సురక్షితమైన వాతావరణంలో మంచి భవిష్యత్తు నిర్మించుకునే అవకాశాన్ని తెలంగాణ ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమం ద్వారా కల్పిస్తోంది.

# జిమ్ ప్రియులకు బిగ్ అలర్ట్



**- యువతే టార్గెట్‌గా స్టెరాయిడ్స్**
**- నిషేధిత ఇంజెక్షన్ల దందా**

**హైదరాబాద్, జూలై 4:అనంత జనశక్తి న్యూస్**

హైదరాబాద్ నగరంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు భారీ ఆపరేషన్ నిర్వహించారు. అక్రమంగా స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, బాడీ బిల్డింగ్ సప్లిమెంట్లను విక్రయిస్తున్న ఓ ఘరానా ముఠాను రట్టు చేశారు. జిమ్‌కు వచ్చే యువతనే టార్గెట్‌గా చేసుకుని, తక్షణ కండరాల పెరుగుదల కోసం ఆశ చూపిస్తూ ఈ నిషేధిత ఉత్పత్తులను విక్రయిస్తున్న ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను టాస్క్ ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ మీడియాకు వెల్లడించారు. గత కొద్ది రోజులుగా నగరంలో స్టెరాయిడ్లు, అనధికార సప్లిమెంట్ల విక్రయాలపై పలు ఫిర్యాదులు రావడంతో టాస్క్ ఫోర్స్ బృందాలు నిఘా పెట్టి ఈ దాడులు నిర్వహించాయని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వీటిని తరలిస్తూ, విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కేసులో అరెస్ట్ అయిన వారందరూ జిమ్ ట్రైనర్లు కావడం గమనార్హం. రోజూ జిమ్‌కు వచ్చే యువతకు వీరు తప్పుడు సమాచారం ఇస్తూ, బాడీ త్వరగా ఫిట్ అవుతుందనే భ్రమలు కల్పించి ఈ ప్రమాదకరమైన ఇంజెక్షన్లను, సప్లిమెంట్లను అంటగడుతున్నట్లు డీసీపీ వివరించారు.

ఈ ముఠాలో బట్టే శివా అనే వ్యక్తి ప్రధాన నిందితుడిగా ఉన్నాడని, గతంలో ఇతనికి సొంతంగా జిమ్ ఉండేదని పోలీసులు టాస్క్ ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. "అది క్లోజ్ అయిన తర్వాత వివిధ జిమ్‌లలో ట్రైనర్‌గా చేరుతూ ఈ దందాకు తెరలేపాడు. ఈ ముఠాకు సప్లిమెంట్లు, ఇంజెక్షన్లు సరఫరా చేస్తున్న ప్రధాన డీలర్లను సైతం పోలీసులు గుర్తించాం. దర్యాప్తులో భాగంగా ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల నుంచి ఈ స్టెరాయిడ్లను హైదరాబాద్‌కు అక్రమంగా రప్పిస్తున్నట్లు తేలింది. మరింత విస్తుపోయే విషయం ఏంటంటే.. ఈ ముఠా ఏఐ ( – ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికతను ఉపయోగించి నకిలీ డాక్టర్ ప్రిస్క్రిప్షన్లను సృష్టించి, తద్వారా ఈ మందులను చలామణి చేస్తున్నట్లు పోలీసులు కనుగొన్నాం. ఈ సరఫరాదారులైన మరో ఇద్దరిని త్వరలోనే అరెస్టు చేస్తామని డీసీపీ వెల్లడించారు. ఈ నేపథ్యంలో జిమ్ ఓనర్లు, ట్రైనర్లు, ముఖ్యంగా యువతకు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఓ ముఖ్యమైన సూచన చేశారు. అర్హత గల డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేదా సలహా లేకుండా ఇలాంటి స్టెరాయిడ్లు, సప్లిమెంట్లను వాడటం ప్రాణాంతకమని హెచ్చరించారు. వీటిని వాడటం వల్ల భవిష్యత్తులో తీవ్రమైన సైకలాజికల్ సమస్యలు (మానసిక రుగ్మతలు) తలెత్తుతాయని, అలాగే క్యాన్సర్ బారిన పడటంతో పాటు కాలేయం, కిడ్నీలు వంటి మల్టీ ఆర్గాన్స్ (ముఖ్య అవయవాలు) పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని డీసీపీ వైభవ్ గైక్వాడ్ ఆందోళన వ్యక్తం చేశారు. సంపాదన కోసం యువత ప్రాణాలతో చెలగాటమాడే ఇలాంటి ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదివారం | రంగారెడ్డి
05.07.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం



# పీసీఓఎస్, పీసీఓడీతో బాధపడే మహిళలకు యోగా కోచ్ సూచించిన 7 ఆసనాలు



పీసీఓఎస్ లేదా పీసీఓడీ సమస్యలను నియంత్రించడానికి యోగా అద్భుతంగా పని చేస్తుందని యోగా కోచ్‌లు చెబుతున్నారు. బటర్‌ఫ్లై పోజ్, భుజంగాసనం వంటి 7 ఆసనాలు రోజూ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని ఓ యోగా కోచ్ సూచించారు. యోగా గురువు రజత్ తరచుగా ఆరోగ్య సమస్యలను లక్ష్యంగా చేసుకుని ఇంట్లో చేయగలిగే వివిధ యోగా భంగిమలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటారు. ఇటీవల ఆయన ఒక వీడియోను పోస్ట్ చేశారు. అందులో పీసీఓఎస్ (పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్), పీసీఓడీ (పాలిసిస్టిక్ ఓవరీ డిసీజ్) సమస్యలతో బాధపడుతున్న మహిళలకు సహాయపడే 7 యోగాసనాల గురించి వివరించారు.









బటర్‌ఫ్లై పోజ్ (బద్ధ కోణాసనం): 2-3 నిమిషాలు
బద్ధ కోణాసనంలో ఫార్వర్డ్ బెండ్: రెండు వైపులా 30 సెకన్లు పట్టుకోవాలి.
అర్ధమత్స్యేంద్రాసనం: రెండు వైపులా 30 సెకన్లు పట్టుకోవాలి.
మలాసనం: 1 నిమిషం కూర్చోవాలి.
చక్కిచలానాసనం: రెండు వైపులా 10 సార్లు పునరావృతం చేయాలి.
భుజంగాసనం: 30 సెకన్లు పట్టుకోవాలి, 3 సెట్లు చేయాలి.
సేతు బంధాసనం: 10 సార్లు పునరావృతం చేయాలి.

**పీసీఓడీ, పీసీఓఎస్ అంటే ఏమిటి?**

PACE హాస్పిటల్స్ ప్రకారం పీసీఓడీ అనేది అండాశయాలు అపరిపక్వమైన లేదా పాక్షికంగా పరిపక్వమైన గుడ్లను ఎక్కువగా ఉత్పత్తి చేసే పరిస్థితి. ఇది సాధారణంగా సరైన జీవనశైలి లేకపోవడం, ఊబకాయం, ఒత్తిడి, హార్మోన్ల అసమతుల్యత వల్ల సంభవిస్తుంది. పీసీఓఎస్ అనేది ఒక జీవక్రియ రుగ్మత (మెటబాలిక్ డిజార్డర్). ఇది పీసీఓడీకి మరింత తీవ్రమైన రూపం. దీని వల్ల అండాశయాలు అండాలను విడుదల చేయడాన్ని పూర్తిగా నిలిపివేస్తాయి.

**పీసీఓడీ, పీసీఓఎస్ సమస్యలకు యోగా ఎలా ఉపయోగపడుతుంది?**

నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ ప్రకారం పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ లక్షణాలను తగ్గించడంలో ఔషధాలతో పాటు యోగా సమర్ధవంతమైన ప్రభావాన్ని చూపుతుందని నిరూపితమైంది. "పీసీఓఎస్ సంబంధిత బరువు పెరుగుదలను నియంత్రిస్తూనే యోగా బరువు తగ్గడాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది జీవక్రియను, మెదడుకు రక్త ప్రవాహాన్ని ప్రేరేపిస్తుంది. తద్వారా హార్మోన్ల సమతుల్యతను తిరిగి స్థాపిస్తుంది. యోగా చేయడం వల్ల గర్భధారణ, సంతానోత్పత్తి అవకాశాలు కూడా పెరుగుతాయి" అని వివరించారు.

# బుల్లెట్ కాఫీ తాగారా? కాఫీలో నెయ్యి కలిపితే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఇవే





ఈ రోజుల్లో మీ ఫోన్‌లో చూస్తే ఏదో ఒక కొత్త ఆరోగ్య ట్రెండ్ కనిపిస్తూనే ఉంటుంది. ఈ మధ్య కాలంలో బాగా ప్రాచుర్యం పొందుతున్న పానీయాలలో ఒకటి నెయ్యి కాఫీ. పోషకాహార నిపుణుల నుండి సెలబ్రిటీల వరకు, అందరూ దీని గురించి మాట్లాడుకుంటున్నారు. 'నెయ్యి కాఫీ' లేదా 'నెయ్యి టీ' గురించి పోస్ట్‌లు పెడుతూ, దీనిని ఆయుర్వేద నివారణిగా లేదా చిన్నప్పటి నుండి తాగుతున్న పానీయంగా పేర్కొంటున్నారు.

మీరు దీన్ని ఇప్పటివరకు ప్రయత్నించారా? లేకపోతే, బహుశా ఇప్పుడు సరైన సమయం కావచ్చు. ఈ సాధారణ పానీయం మీ మెటబాలిజంను పెంచడానికి, గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి, పీరియడ్స్ నొప్పిని తగ్గించడానికి కూడా సహాయపడుతుందని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. నెయ్యి కాఫీ కేవలం ఒక ట్రెండీ పానీయం కంటే ఎక్కువ ఎందుకు అనేది తెలుసుకుందాం.

**నెయ్యి కాఫీ అంటే ఏమిటి?**

నెయ్యి కాఫీని బుల్లెట్ ప్రూఫ్ కాఫీ అని కూడా అంటారు. ఇది బ్లాక్ కాఫీ, నెయ్యి మిశ్రమం. ఇది క్రీమీగా, చిక్కగా ఉండే పానీయం. దీనిని ఉదయం పూట తాగుతారు. కాఫీకి నెయ్యి ద్వారా ఆరోగ్యకరమైన కొవ్వు తోడవడంతో ఇది స్థిరమైన శక్తిని అందిస్తుంది. ఏకాగ్రతను మెరుగుపరుస్తుంది. ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఇది తక్కువ కార్బ్, ఆయుర్వేద ఆహారాలలో ప్రాచుర్యం పొందింది.





**1. ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంటుంది**

అన్ని కొవ్వులు మన ఆరోగ్యానికి చెడ్డవి కావు. "నెయ్యి ఒమేగా-3, ఒమెగా 6, ఒమెగా 9 వంటి ఆరోగ్యకరమైన కొవ్వులతో సమృద్ధిగా ఉంటుంది. ఇది విటమిన్లు A, E, మరియు K లకు సహజ వనరు. మరోవైపు కాఫీలో కెఫిన్, కాఫెస్టోల్, కహ్వియోల్, క్లోరోజెనిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ రోగనిరోధక శక్తికి అండగా ఉంటాయి" అని పోషకాహార నిపుణురాలు విధి చావ్లా అంటున్నారు. 'ట్రెండ్స్ ఇన్ ఫుడ్ సైన్స్ & టెక్నాలజీ'లో ప్రచురితమైన ఒక అధ్యయనం రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడంలో కాఫీ ప్రయోజనాలను హైలైట్ చేస్తుంది.

**2. జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది**

ఖాళీ కడుపుతో కాఫీ తాగడం వల్ల ఎసిడిటీ వస్తుందని మీరు నమ్ముతుంటే.. దానిని వదిలించుకోవడానికి నెయ్యితో బ్లాక్ కాఫీని ప్రయత్నించండి. నెయ్యిలో ఉండే బ్యుటిరిక్ యాసిడ్ జీర్ణక్రియకు సహాయకారిగా ఉంటుంది. ప్రేగులలో మంటను తగ్గిస్తుంది. పొట్ట ఉబ్బరంతో బాధపడేవారికి నెయ్యి కాఫీ ముఖ్యంగా సహాయపడుతుంది.

**3. కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరుస్తుంది**


బ్లాక్ కాఫీని నెయ్యితో కలపడం వల్ల గుండె ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుంది. నెయ్యి మంటను తగ్గించడానికి, కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేయడానికి సహాయపడుతుంది. నిజానికి, 'ఓచ్స్నర్ జర్నల్'లో ప్రచురితమైన ఒక అధ్యయనం కాఫీ గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించగలదని, రక్తపోటును తగ్గించగలదని, కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచగలదని చూపిస్తుంది.

**4. పీరియడ్స్ నొప్పికి సహాయపడుతుంది**

నెయ్యిలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి పీరియడ్ క్రాంప్స్ తీవ్రతను తగ్గించవచ్చు. "ఇది శక్తిని పెంచడానికి, ఆరోగ్యకరమైన రుతుక్రమ చక్రానికి మద్దతు ఇవ్వడానికి హార్మోన్ల సమతుల్యతను కూడా అందిస్తుంది" అని చావ్లా వివరిస్తున్నారు.

**5. ఆకలిని తగ్గిస్తుంది**

ఉదయం నెయ్యి కాఫీ తాగడం వల్ల ఆకలిని నియంత్రించవచ్చు. ఆరోగ్యకరమైన కొవ్వులు మీకు ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తాయి. కాబట్టి మీరు అనవసరంగా స్నాక్స్ తినే అవకాశం తక్కువగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన బరువు నిర్వహణకు తోడ్పడుతుంది.



అనంత జనశక్తి
ఆదివారం | రంగారెడ్డి
05.07.2026





# డ్రీమ్ థియేటర్‌కి స్వాగతం

"అమ్మా.. ఇతను ఎవరు?" అంటూ ఓ పిల్లాడు తన తల్లిని అడుగుతున్నాడు. 'ఒక కథకు ఏం అవసరం.. కచ్చితంగా అందులో ఒక కథానాయకుడు ఉండాలి కదా!.. ఈయనే ఆ హీరో' అని సమాధానమిచ్చింది తల్లి. ఇంతకీ ఆ హీరో కథేంటి అనేది తెలుసుకోవాలంటే '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' సినిమా చూడాల్సిందే. కన్నడ హీరో శివరాజ్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. ప్రియాంక మోహన్ కథానాయిక. 'సప్తసాగరాలు దాటి' ఫేమ్ హేమంత్ ఎం రావు తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది ప్రియాంక. "ఆపరేషన్ డ్రీమ్ థియేటర్ ప్రపంచానికి స్వాగతం" అనే వ్యాఖ్యను జోడించింది. 1970 నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. డాలీ ధనుంజయ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని వైశాఖ్ గౌడ నిర్మిస్తున్నారు.





# అనిల్ రావిపూడి కొత్త మూవీ దానికి రీమేకా?.. క్లారిటీ ఇచ్చిన కీర్తి సురేశ్

ప్రతి సంక్రాంతికి ఒక సినిమాతో వస్తానంటూ దర్శకుడు అనిల్ రావిపూడి ఫుల్ జోష్‌లో సినిమాలు చేస్తున్నారు. ఇప్పుడు వెంకటేశ్, కల్యాణ్ రామ్ ప్రధానపాత్రల్లో ఆయన దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాను ప్రకటించిన నాటి నుంచి ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంది. తాజాగా ఓ మలయాళ సినిమాకు రీమేక్‌గా ఈ చిత్రం రానుందంటూ వార్తలు వైరల్ కాగా.. నటి కీర్తి సురేశ్ ఈ వార్తలకు చెక్ పెట్టారు.

'#VenkyAnil5' అనే పేరుతో ప్రచారంలో ఉన్న ఈ సినిమాలో వెంకటేశ్‌కు జోడీగా కీర్తి సురేశ్ నటిస్తుండగా.. కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి కనిపించనున్నారు. తాజాగా ఓ ఇన్‌స్టా పేజ్ దీనిపై అప్‌డేట్ అంటూ.. ఓ విషయాన్ని పంచుకుంది. ఈ సినిమా 2024లో విడుదలైన మలయాళ కామెడీ చిత్రం 'గురువాయూర్ అంబలనాదయిల్'కు రీమేక్‌గా రానున్నట్లు పోస్ట్ పెట్టింది. ఆ పోస్ట్‌కు కీర్తి స్పందిస్తూ.. అది నిజం కాదన్నారు. దీంతో ఈ వార్తలకు చెక్ పెట్టినట్లైంది. ఇటీవలే ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. రాయలసీమ నేపథ్యంలో అనిల్ మార్క్ కథ, హాస్యంతో రూపొందుతోంది.

గతేడాది అనిల్- వెంకటేశ్ కాంబోలో పండక్కి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీస్ బరిలో భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే జోష్‌తో మరోసారి నవ్వులు పంచేందుకు ఈ సినిమాతో సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం సెట్స్‌పైన ఉన్న ఈ సినిమాకు జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు.

# తేజ కోసం బాలీవుడ్ అందం



హను-మాన్', 'మిరాయ్' చిత్ర విజయాలతో జోరుమీదున్నారు యువ హీరో తేజ సజ్జా. ప్రస్తుతం ఆయన 'జాంబిరెడ్డి 2' కోసం రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమాని సుపర్ణ్ వర్మ తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ఇందులో తేజకు జోడీగా బాలీవుడ్ భామ శనయా కపూర్ నటిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆమె ఈ చిత్ర సెట్‌లోకి అడుగు పెట్టిందని.. ప్రస్తుతం తేజ - శనయాలపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారని తెలిసింది. ఈ సినిమాకి దర్శకుడు ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. ఎస్‌జే సూర్య ముఖ్య పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. తేజ ప్రస్తుతం పీపుల్ మీడియా సంస్థలోనే 'మిరాయ్ 2' సినిమాని చేస్తున్నారు. ఈ రెండు చిత్రాలు వచ్చే ఏడాది తెరపైకి వచ్చే అవకాశముంది.

# శ్రేయస్ 'మాస్టర్‌క్లాస్' ఇన్నింగ్స్.. వారికి బ్యాట్‌తోనే సమాధానం: పార్థివ్ పటేల్



ఐర్లాండ్‌తో తొలి రెండు టీ20ల్లో విఫలమైన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ .. ఇంగ్లాండ్‌తో మ్యాచ్ చెలరేగాడు. ఓ వైపు వికెట్లు పడినా సరే.. దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో ఇంగ్లాండ్‌పై టీ20ల్లో హాఫ్ సెంచరీ చేసిన టీమ్‌ఇండియా బ్యాటర్‌గా నిలిచాడు. ఓపెనర్ అభిషేక్ శర్మ దూకుడుగా ఆడుతున్నప్పుడు శ్రేయస్ యాంకర్ పాత్ర పోషించాడు. శ్రేయస్ కెరీర్‌లో ఇదొక మాస్టర్‌క్లాస్ ఇన్నింగ్స్‌గా నిలిచిపోతుందని మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ వ్యాఖ్యానించాడు.

"శ్రేయస్ అయ్యర్ ఆటతీరుపై ప్రశ్నలు లేవనెత్తినవారు ఈ ఇన్నింగ్స్ తర్వాత చాలా ఉపశమనం పొంది ఉంటారు. ప్లేయర్‌గా శ్రేయస్ దేని గురించీ ఆందోళన చెందక్కర్లేదు. అతడు ఈ ఫార్మాట్‌లో నిరూపించుకొన్న ఆటగాడు. అయితే, ఐర్లాండ్‌తో విఫలమైన తర్వాత.. చాలా విమర్శలు ఎదుర్కొన్నాడు. కాబట్టే, ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లు అతడికి చాలా కీలకం. తొలి టీ20ల ఆడిన తీరు అద్భుతం. ఆరంభంలోనే రెండు వికెట్లు పడిన తర్వాత.. దూకుడుగా ఆడే అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. మరీ ఎక్కువగా సిక్స్‌లపై ఆధారపడకుండా యాంకర్ పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో ఆడిన అనుభవంతో ప్రతి భారత క్రికెటర్ సిక్స్‌లు కొట్టేందుకే అలవాడి ఉంటాడు. దాన్నుంచి శ్రేయస్ బయటపడ్డాడు. స్ట్రైక్‌ను రొటేట్ చేస్తూ.. కేవలం ఫోర్లతోనే స్కోరు బోర్డును నడిపించాడు. అందుకే అతడి కెరీర్‌లో ఇది మాస్టర్ క్లాస్ ఇన్నింగ్స్ అని చెబుతా" అని పార్థివ్ తెలిపాడు.

సూర్యవంశీకి సరైన సందేశం ఇవ్వాలి

"వైభవ్ సూర్యవంశీకి తప్పకుండా ఈ సిరీస్‌లో అవకాశం వస్తుందని అనుకుంటున్నా. అయితే, ఇక్కడ సరైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం. కోచింగ్ స్టాఫ్‌గా అది వారిపై ఉన్న బాధ్యత. అతడిని ఆడించడం లేదని ముందే చెప్పాలి. 15 ఏళ్ల పిల్లాడితో చాలా జాగ్రత్తగా మాట్లాడాల్సిన అవసరం ఉంది" అని పార్థివ్ తెలిపాడు.

# రోజర్ ఫెదరర్‌తో '106'వ మ్యాచ్‌ను పెట్టండి: నొవాక్ జకోవిచ్

వింబుల్డన్‌లో టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ 105వ మ్యాచ్‌ను గెలిచాడు. దీంతో టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ సరసన జకోవిచ్ నిలిచాడు. ఫెదరర్ కూడా వింబుల్డన్‌లో 105 విజయాలను నమోదు చేశాడు. అయితే, ఈ రికార్డును జకో బ్రేక్ చేయడం పెద్ద కష్టమేం కాదు. ఈ టోర్నీలో ఇది ఇంకా మూడో రౌండే. మున్ముందు చాలా మ్యాచులు ఉన్నాయి. ఓవరాల్‌గా సింగిల్స్‌లో మార్టినా నవత్రిలోవా అత్యధికంగా 120 మ్యాచుల్లో గెలిపొందింది. పురుషుల విభాగంలో మాత్రం ఫెదరర్ - జకోవిచ్ సమంగా నిలిచారు. మూడో రౌండ్‌లో గెలిచిన తర్వాత.. వింబుల్డన్ నిర్వాహకులకు ఓ విన్నపం చేశాడు.

"నేను ఈ మ్యాచ్ సమయంలో కాస్త ఒత్తిడికి గురయ్యా. మిగతా సమయాల్లో కంటే అదనంగా టెన్షన్ పడ్డా. ఈ మ్యాచ్ సవాళ్లు విసురుతుందని తెలుసు. రోజర్ ఫెదరర్ రికార్డును సమం చేయడం గొప్పగా భావిస్తున్నా. ఈ సందర్భంగా నిర్వాహకులకు ఓ విజ్ఞప్తి. ఆ '106'వ విజయం కోసం మా ఇద్దరి మధ్య మ్యాచ్ నిర్వహించాలని ప్రపోజ్ చేస్తున్నా" అని జకోవిచ్ వ్యాఖ్యానించాడు.




నాలుగో రౌండ్‌లో..

వింబుల్డన్ ) మూడో రౌండ్‌లో జకోవిచ్ 7-5, 6-4, 1-6, 7-6 తేడాతో ఫ్రాన్స్ ఆటగాడు రిండర్‌నెచ్‌పై విజయం సాధించాడు. ఇక నాలుగో రౌండ్‌లో రష్యా ఆటగాడు రోమన్ సఫిల్లిన్‌తో జకో తలపడతాడు. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ జనిక్ సినర్ కూడా నాలుగో రౌండ్‌కు చేరాడు. జపాన్‌కు చెందిన షింటారో మోచిజుకితో సినర్ నాలుగో రౌండ్‌లో తలపడతాడు.

# వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం.. సచిన్ రికార్డు బ్రేక్



భారత క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ సరికొత్త చరిత్రను లిఖించాడు. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టీ20లో వైభవ్ అరంగేట్రం చేశాడు. దీంతో కేవలం 15 ఏళ్ల 99 రోజుల వయసులోనే టీమ్‌ఇండియా తరఫున అరంగేట్రం చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇంతకుముందు సచిన్ పేరిట ఉన్న ఈ రికార్డును వైభవ్ బద్దలు కొట్టాడు. సచిన్ 16 ఏళ్ల 205 రోజుల వయసులో టీమ్‌ఇండియా తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడగా.. ఇప్పుడు వైభవ్ కేవలం పదిహేనేళ్లకే అడుగు పెట్టడం విశేషం.

# పుంజుకున్న గుకేశ్

గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న జాగ్రెబ్ అంచె టోర్నీలో భారత స్టార్ దొమ్మరాజు గుకేశ్ పుంజుకున్నాడు. ర్యాపిడ్ విభాగంలో ఆరు రౌండ్ల తర్వాత అతడు ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచాడు. నాలుగో రౌండ్లో డానియెల్ (రొమేనియా) చేతిలో ఓడిన గుకేశ్.. తర్వాత నెదర్లాండ్స్ గ్రాండ్‌మాస్టర్లు వాన్ ఫారెస్ట్, అనీష్ గిరిలను ఓడించాడు. అతడు 7 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ప్రజ్ఞానంద కాస్త వెనుకబడ్డాడు. తొలి గేమ్‌లో ఫారెస్ట్‌ను ఓడించిన అతడు.. తర్వాతి గేమ్‌లలో అబ్దు సతారోవ్ (ఉజ్బెకిస్థాన్), అలీరెజా (ఫ్రాన్స్)లకు తలొంచాడు. ప్రస్తుతం 6 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. అలీరెజా (10) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314